ఆంధ్రజ్యోతి
ఉష్ణోగ్రతలు గరిష్ఠం : 32.0 । కనిష్ఠం : 22.0
ANDHRAJYOTHY
5



పారా మెడికల్ కోర్సు కోసం దరఖాస్తు చేసుకోండి

నారాయణపేట, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట ప్రభుత్వ వైద్య కళాశాలలో రెండు సంవత్సరాల పారా మెడికల్ డిప్లొమా కోర్సు కోసం ఇంటర్ పాసైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ డి.రాంకిషన్ గురువారం తెలిపారు. కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఆధ్వర్యంలో జరిగే అడ్మిషన్‌ల కోసం విద్యార్థులు దరఖాస్తులను ఈ నెల 15 నుంచి 21 వరకు అప్పక్‌పల్లి మెడికల్ కళాశాలలో ఇవ్వాలన్నారు. డయాలసిస్ విభాగంలో 30 సీట్లు, ఈసీజీ విభాగంలో 30లో సీట్లు కోసం దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

భవితకు బాటలు

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు 7
పాఠకులకు అందుబాటులో వేలాది పుస్తకాలు
పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే వారికి మెటీరియల్
గురువారం నుంచి ప్రారంభమైన వారోత్సవాలు





నిరుపయోగంగా మారిన రైతుల విశ్రాంతి షెడ్డు, వాటర్ ట్యాంక్

సౌకర్యాలు కరువు

అభివృద్ధి పనులకు రూ.3.89 కోట్లు మంజూరు
అధికారుల నిర్లక్ష్యంతో చేపట్టని పనులు
జీరో దందాతో గద్వాల మార్కెట్ ఆదాయానికి గండి
పట్టించుకోని పాలకులు, అధికారులు 6

మోదుగుంటను.. పూడ్చేశారు

హైడ్రా అంటేనే హడల్... అది కాస్త పాలమూరులోని సర్వే నెంబర్ 523కి రాగానే ప్రతీ ఒక్కరిలో ఏదో ఆందోళన. రియల్టర్లు, ప్లాట్ల అమ్మకందారులు చేసిన తప్పిదాల వల్ల ఆపద ఎవరి ఇంటికి ఎలా వస్తుందోననే ఆందోళన... చెరువులు, కుంటలు, కాల్వల సమీపంలో లక్షలు వెచ్చించి కొన్న ప్లాట్లు, ఇళ్ల యజమానుల్లో భయం భయం... కానీ, ఇక్కడ మాత్రం జాన్తానై.. హైడ్రాలు ఉన్నా, ఫిర్యాదులు చేస్తున్నా, అధికారులు తనిఖీల పేర తతంగం నడిపిస్తున్నా యథేచ్ఛగా ఆక్రమణ జరుగుతోంది... అది ఎక్కడో మారుమూల ప్రాంతంలో కాదు. పాలమూరు ప్రధాన రహదారి పక్కనే కావడం ఆశ్చర్యం.. అటు నుంచే అధికారులు, ప్రజాప్రతినిధులు వెళుతున్నా ఇదంతా ఎవరి కూడా తెలియదంటే నమ్మాల్సిందే.. ఈ వ్యవహారంలో ప్రభుత్వ ఆస్తులను ప్రైవేటు వ్యక్తుల చెర నుంచి రక్షించాలని ప్రయత్నిస్తున్న వారికి నిరాశ ఎదురవుతోంది.. ఈ పరిస్థితుల్లో ఏనుగొండలోని మోదుగుంటను రక్షించేరా, ఆక్రమణదారులకు అప్పగించేరా...

- హైడ్రా భయం కలిగిస్తున్నా ఆగని ఆక్రమణలు
- రూ. 20 కోట్ల విలువైన శిఖం, ఎఫ్‌టీఎల్ భూములు దర్జాగా కబ్జా
- మోదుగుంట చెరువును పూడ్చివేసి రోడ్డు నిర్మాణం
- నిషేధిత జాబితాలోని భూమిలో సూపర్ మార్కెట్?
- కోర్టు ఆర్డర్ ఉన్నా విచారణకు గైర్హాజరవుతున్న పరిస్థితి
- చర్యలకు మీనమేషాలు లెక్కిస్తున్న అధికార యంత్రాంగం
- సర్వే నెంబర్ 292 గుట్టు తేలితే ప్రభుత్వ భూమికి రక్షణ



సర్వే నెంబర్ 292 మ్యాపు.. అందులోనే ఉన్న నిర్మాణం(ఇన్‌సెట్లో)



మోదుగుంట చెరువును పూడ్చుకుంటూ వేస్తున్న రోడ్డు

మహబూబ్‌నగర్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : ఓ వైపు రాజధానిలో హైడ్రా పేరుతో చెరువుల ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లలో నిర్మించిన అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తుండగా మరోవైపు మహబూబ్‌నగర్ పట్టణంలోని సర్వే నెంబర్ 523లో అక్రమ నిర్మాణాల పేర కొన్నింటిని తొలగించిన విషయం తెలిసిందే. ఆ భయం ఉంటే కబ్జాదారులు ప్రభుత్వ, ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ భూముల్లో నిర్మాణాలు కానీ, కబ్జాలు కానీ ఎవరూ చేయబోరని ప్రభుత్వం, అధికార యంత్రాంగం భావన. అయినా మహబూబ్‌నగర్ నడిబొడ్డున ఆక్రమణల పర్వం ఆగడం లేదు. గతంలోనే ప్రభుత్వ భూములు, ధరణిలో నిషేధిత జాబితాలో ఉన్న భూములను కబ్జా చేసి నిర్మాణాలు చేపట్టి వాటి ద్వారా లబ్ధి పొందుతుండగా తాజాగా మరో అడుగు ముందుకేసి కబ్జా పరిధిని విస్తృతం చేస్తున్న విచిత్ర పరిస్థితి నెలకొన్నది. జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులంతా వెళ్లే దారిలోనే ఈ కబ్జాల పర్వం నడుస్తున్నా,

(మిగతా 6లో..)

బాలల దినోత్సవం సాక్షిగా..

క్లిక్.. క్లిక్..



ఆటోలో కూలీకి పత్తి తీయడానికి వెళ్తున్న బాలలు



చేలో పత్తి తీస్తున్న బాలలు

బాలల దినోత్సవం సాక్షిగా బాల్యం పత్తి చేలల్లో బందీ అయ్యింది. పలకా బలపం పట్టి, అక్షరాలు దిద్దాల్సిన ఆ బాలలు అవే చేతులతో పత్తి తీస్తున్నారు. బ్యాగు భుజాన వేసుకొని బడికి వెళ్లాల్సిన వారు.. సంచులు చేత పట్టుకొని, ఆటోలో కూలికి వెళ్తున్నారు. అమలు కాని పథకాల వల్ల బడి ఈడు పిల్లలు బడిలో ఉండాలన్న ప్రభుత్వ లక్ష్యం నెరవేరడం లేదు. నాగర్‌కర్నూల్ జిల్లా పదర మండలం వంకేశ్వరం గ్రామంలో గురువారం కనిపించిన ఈ దృశ్యాలను 'ఆంధ్రజోతి' క్లిక్ మనిపించింది.

- పదర, ఆంధ్రజ్యోతి

కాట్రేవుపల్లి నుంచి రిజిస్ట్రార్ దాకా..

పీయూ రిజిస్ట్రార్‌గా బాధ్యతలు చేపట్టిన ప్రొఫెసర్ చెన్నప్ప



బాధ్యతలు చేపడుతున్న చెన్నప్ప

పాలమూరు యూనివర్శిటీ, నవంబరు 14 (ఆధ్రజ్యోతి): పాలమూరు యూనివర్సిటీ రిజిస్ట్రార్‌గా ప్రొఫెసర్ చెన్నప్ప గురువారం బాధ్యతలు చేపట్టారు. వీసీ ప్రొఫెసర్ జీఎన్ శ్రీనివాస్ సమక్షంలో ఇన్‌చార్జి రిజిస్ట్రార్ డాక్టర్ మధుసూదన్ రెడ్డి నుంచి ఏడో రిజిస్ట్రార్‌గా బాధ్యతలు చేపట్టారు. నారాయణపేట జిల్లా మక్తల్ మండలం కాట్రేవుపల్లి గ్రామానికి చెందిన చెన్నప్పది వ్యవసాయ కుటుంబం. ఎన్నో కష్టాలను ఎదుర్కొని, రిజిస్ట్రార్ వరకు ఎదిగారు. మొదటి నుంచి ప్రభుత్వ విద్యా సంస్థల్లోనే చదివిన ఆయన అందరికంటే ముందుండేవారు. ఆయన పర్యవేక్షణలో రెండు ఎంఫిల్, 14 పీహెచ్‌డీలు లభించాయి. 2012-14లో రీసెర్చ్ అవార్డు, 2019లో తెలంగాణ రాష్ట్ర ఉత్తమ అధ్యాపక, 2020లో ఐపీఏ బెస్ట్ కామర్స్ ఫ్యాకల్టీ, 2022లో ఉస్మానియా యూనివర్సిటీ వైస్ చాన్సలర్ అవార్డులను అందుకున్నారు.

సొంత జిల్లాకు రావడం సంతోషంగా ఉంది

సొంత జిల్లా ఉమ్మడి పాలమూరు యూనివర్సిటీకి రిజిస్ట్రార్‌గా వచ్చి, సేవ చేసే అవకాశం రావడం సంతోషంగా ఉందని రిజిస్ట్రార్ చెన్నప్ప అన్నారు. అధ్యాపకులు బాధ్యతతో కష్టపడి పని చేయాలని, ఉద్యోగులు సమయ పాలన పాటించాలని సూచించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించి, ఉపాధి కోర్సులతో ఉపాధి అవకాశాలు కల్పించడమే తన లక్ష్యమని చెప్పారు. స్టూడెంట్స్ బాగా చదివి, ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని కోరారు.

మైనారిటీ గురుకులాలకు అద్దె భారం

- ఉమ్మడి జిల్లాలో 20 పాఠశాలలు
- సొంత భవనాలు లేక అన్నీ అద్దె భవనాల్లోనే..
- నెలకు రూ.52.43 లక్షల కిరాయి
- బకాయిలు రాక పాఠశాలలకు తాళాలు వేస్తున్న యజమానులు
- మహబూబ్‌నగర్‌లో నాలుగేళ్లుగా పూర్తికాని సొంత భవనాలు
- మిగతా చోట్ల స్థలాల కేటాయింపుతోనే సరి



మహబూబ్‌నగర్ జిల్లా బోయపల్లి శివారులో నాలుగేళ్లుగా పూర్తికాని మైనారిటీ గురుకుల పాఠశాల నిర్మాణం

మహబూబ్‌నగర్ అర్బన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మైనారిటీ గురుకుల పాఠశాలలు, కళాశాలలకు సొంత భవనాలు లేకపోవడంతో అద్దె భారంగా మారింది. ప్రభుత్వం నుంచి బకాయిలు సకాలంలో విడుదల కాకపోవడంతో భవనాల యజమానులు వాటికి తాళాలు వేస్తున్నారు. ఫలితంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. విద్యార్థులకు కార్పొరేట్ స్థాయిలో విద్య అందించాలన్న ఉద్దేశంతో గత ప్రభుత్వం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మైనారిటీ గురుకులాలను ప్రారంభించింది. ఐదు నుంచి పదో తరగతి వరకు ఉన్న వాటిని ఆ తర్వాత కొన్ని పాఠశాలలను ఇంటర్ వరకు అప్‌గ్రేడ్ చేసింది. ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో బాల, బాలికల గురుకులాలు 20 వరకు ఉన్నాయి. వీటి పరిధిలో సుమారుగా 10 వేల మంది బాల బాలికలు చదువుకుంటున్నారు. ఆ స్కూల్స్, కళాశాలలు అద్దె భవనాల్లో నిర్వహిస్తున్నారు. నెలకు అద్దె రూ.52.43 లక్షలు చెల్లిస్తున్నారు. సొంత భవనాలకు ప్రభుత్వం స్థలం కేటాయించి, నిధులు విడుదల చేసినా అవి నాలుగైదు ఏళ్లుగా నిర్మాణంలోనే ఉన్నాయి.

దాంతో అద్దె భవనాలకు నెలకు రూ.52 లక్షల చొప్పున సంవత్సరానికి రూ.6.29 కోట్లు చెల్లిస్తుండటంతో ప్రభుత్వ ఖజానాకు గండిపడుతోంది. సొంత భవనాలు నిర్మిస్తే ఈ భారం తగ్గుతుంది.

స్థలాలు కేటాయించి వదిలేశారు..

ఉమ్మడి పాలమూరులోని మహబూబ్‌నగర్ జిల్లాకు ఆరు మైనారిటీ గురుకులాల భవనాలు నిర్మించేందుకు ప్రభుత్వం 2016లో ఆదేశాలు జారీ చేసింది. ఒక్కో గురుకులానికి రూ.20 కోట్ల చొప్పున రూ.120 కోట్లు మంజూరు చేసింది. బోయపల్లి శివారులో బాలికల భవన నిర్మాణాన్ని ఐదు ఎకరాల ప్రభుత్వ స్థలంలో 2019లో ప్రారంభించారు. పనులు

(మిగతా 6లో..)

లైఫ్ స్కిల్స్ పెంపొందించుకోవాలి

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): చదువుతో పాటు ఆరోగ్యం, లైఫ్ స్కిల్స్‌ను పెంపొందించుకోవాలని మహబూబ్‌నగర్ కలెక్టర్ విజయేందిర బోయి చెప్పారు. సంపూర్ణ వ్యక్తిత్వ వికాసం విజ్ఞానాన్ని పెంచుకోవాలని అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో మహిళా, శిశు, దివ్యాంగులు, వయోవృద్ధుల శాఖ ఆధ్వర్యంలో గురువారం జాతీయ బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఆటల పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులను అందించారు. బాలల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. రెడ్‌క్రాస్ సంస్థ ద్వారా పిల్లలకు పుస్తకాలు, పెన్నులు, కంపాక్స్ బాక్స్ 10 వస్తువులతో కూడిన 300 కిట్లను అందించారు.



విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న కలెక్టర్ విజయేందిర బోయి

న్యూస్ బాక్స్

జాతీయ స్థాయి పోటీలకు వెళ్లిన శివమణి

నారాయణపేట, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల పాఠశాల తొమ్మిదో తరగతి విద్యార్థిని శివమణి జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైంది. ఈ నెల 16 నుంచి 20 వరకు ఉత్తర ప్రదేశ్‌లో జరిగే అండర్ 17 స్కూల్ గేమ్స్ జాతీయ స్థాయి పోటీలకు తెలంగాణ రాష్ట్రం నుంచి 12 మందితో కలిసి శివమణి గురువారం తరలి వెళ్లింది. రాచాలలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీల్లో శివమణి ప్రతిభ కనబరిచి, జాతీయ స్థాయికి ఎంపికైంది. శివమణి జాతీయ స్థాయి పోటీల్లో రాణించాలని ప్రిన్సిపాల్ యాదమ్మ, పీడీ యాదమ్మ, పీఈటీ సవిత ఆకాంక్షించారు.



దివంగత ఎస్పీ పరదేశీ నాయుడు చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న ఎస్పీ జానకి, తదితరులు

పరదేశీ నాయుడికి నివాళి

మహబూబ్‌నగర్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): సంఘ వ్యతిరేక శక్తులకు ఎదురొడ్డి పోరాడి, ప్రాణాలు అర్పించిన దివంగత ఎస్పీ పరదేశీ నాయుడు త్యాగం మరువలేనిదని మహబూబ్‌నగర్ ఎస్పీ జానకి అన్నారు. ఆయన ఆశయసాధన కోసం పోలీసులు పని చేయాలని చెప్పారు. గురువారం పరదేశీ నాయుడు వర్ధంతిని పురస్కరించుకుని జిల్లా కేంద్రంలో ఆయన చిత్రపటానికి, అనంతరం పరదేశీనాయుడు చౌక్‌లో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 1993 నవంబరు 14న సోమశిల వద్ద జరిగిన ఘటనను గుర్తు చేశారు. ఆరోజు ఎస్పీతోపాటు తొమ్మిది మంది పోలీసులు సంఘ వ్యతిరేక శక్తులతో పోరాడే క్రమంలో ప్రాణాలను అర్పించారని చెప్పారు. పోలీసు కుటుంబానికే పరదేశీనాయుడు గర్వకారణమన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఏ రాములు, ఏఆర్ అదనపు ఎస్పీ సురేశ్‌కుమార్, వర్టికల్ డీఎస్పీ సుదర్శన్, డీసీఆర్‌బీ డీఎస్పీ రమణారెడ్డి, ఏవో రుక్మిణి పాల్గొన్నారు.

ప్రదర్శన బాగుంది

- అభినందించిన కలెక్టర్



పూల వేషధారణలో ప్రదర్శన ఇస్తున్న విద్యార్థులు

ధన్వాడ, నవంబరు 14: విద్యార్థుల ప్రదర్శన బాగుందని నారాయణపేట కలెక్టర్ సిక్తా పట్నాయక్ అభినందించారు. బాలల దినోత్సవం సందర్భంగా నారాయణపేట జిల్లా ధన్వాడ రైతు వేదిక వద్ద కంసాన్‌పల్లి ప్రాథమిక, కుర్వవాడ పాఠశాల విద్యార్థులు మంగళవారం వివిధ రకాల వేషధారణలతో చేసిన ప్రదర్శన ఆకట్టుకుంది. యంగ్ అరేటర్ క్లబ్ ఈ కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు చిన్నప్పటి నుంచి బాగా చదువుకొని ఉన్నతంగా ఎదగాలని చెప్పారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలన్నారు.

మోదుగుంటను పూడ్చేశారు

(మొదటి పేజీ తరువాయి)

అది ఆక్రమణ అని తెలుస్తున్నా ఇప్పటివరకు నిర్దిష్టంగా చర్యలు తీసుకోవడం లేదు. మరి వారికి అధికారులు మద్దతు ఇస్తున్నారా అనేది తేలాల్సి ఉంది.

చెరువును చెరబట్టారు..

మహబూబ్‌నగర్ అర్బన్ మండలం ఎనుగొండ శివారులోని 292 సర్వే నెంబర్‌లో 7.29 ఎకరాల ప్రభుత్వ భూమి ఉన్నది. ఇది మొత్తం మోదుగుంట చెరువు భూమి. పక్కన ఇదే సర్వే నెంబర్‌లో దాదాపు 5.22 ఎకరాలు పట్టా భూమి కూడా ఉన్నది. అది కూడా ఈ చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్నది. నీరు బాగా వస్తే ఈ భూములన్నీ ముంపునకు గురవుతాయి. అయితే ఈ చెరువు భూమిలో కొంతభాగం మౌలాలి గుట్ట డబుల్ బెడ్‌రూం ఇళ్లకు వెళ్లేందుకు మట్టి పోసి కచ్చా రోడ్డు వేయగా ఆ పక్కనే ఉన్న పంక్షన్ హాల్, సూపర్ మార్కెట్‌లలో కొంత భాగం ఎఫ్‌టీఎల్ పరిధిలోకి వచ్చే అవకాశం ఉన్నది. అలాగే 292 సర్వే నెంబర్‌లోకే సూపర్ మార్కెట్ మెజారిటీ స్థలం వస్తుందని ధరణి కెడస్ట్రల్ మ్యాప్‌ల ద్వారా స్పష్టంగా తెలుస్తోంది. 291 సర్వే నెంబర్‌లో పట్టా కలిగి ఉన్న సదరు పంక్షన్ హాల్ నిర్వాహకులు తాజాగా వారి హద్దును దాటి 292 సర్వే నెంబర్‌లోని చెరువును పూడుస్తూ మళ్లీ రోడ్డును నిర్మిస్తున్నారు. మొదటి నుంచి రోడ్డు కోసమని మట్టిని పోయడం, తర్వాత హద్దులు మార్చడం ఇక్కడ ఆనవాయితీగా వస్తోందని ఎనుగొండ స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇటీవల స్థానికుల నుంచి వచ్చిన ఫిర్యాదును పరిగణనలోకి తీసుకొని రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు వెళ్లి విచారణ కూడా నిర్వహించారు. అక్కడ 292 సర్వే నెంబర్ మొత్తం ప్రభుత్వ భూమేనని, అందులో కొంతమేర నిర్మాణాలు ఉన్నట్లు గుర్తించారు. అయితే దానికోసం ఇరిగేషన్, రెవెన్యూ, మునిసిపల్ శాఖ ఆధ్వర్యంలో సంయుక్త సర్వే నిర్వహించాల్సి ఉంది. కానీ, మునిసిపల్ అధికారులు ఈ ఆక్రమణలపై చర్యలకు ఉపక్రమించడం లేదు. దాదాపు ఎకరం స్థలం వరకు ప్రభుత్వ భూమి ఇక్కడ కబ్జా అయ్యిందని ఆరోపణలు ఉండగా దాని విలువ రూ. 20 కోట్ల వరకు ఉంటుందని అంచనా. మొదట చెరువు ఎఫ్‌టీఎల్‌ను ఆక్రమించడం, ప్రభుత్వ భూమిలో నిర్మాణాలు చేపట్టిన సమయంలోనే అధికారులు చర్యలు తీసుకోకపోవడం, కొంతమంది అధికారులకు డబ్బులు ముట్టజెప్పి పనులు చేసుకోవడంతో తాజాగా ఇంత భయాందోళనలోనూ కబ్జా చేయడానికి సదరు వ్యక్తులు సహకరిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.


గతంలో చెరువును పూడ్చి మౌలాలి గుట్టకు వెళ్లేందుకు వేసిన కచ్చా రోడ్డు

కోర్టు ఆదేశాలు బేఖాతరు..

ఈ సర్వే నెంబర్‌లోని భూములన్నీ ధరణిలో నిషేధిత జాబితాలో ఉన్నాయి. ఇప్పుడున్న ఫంక్షన్ హాల్, సూపర్ మార్కెట్ కూడా చెరువుకు అతిసమీపంలో ఉన్నాయి. మౌలాలి గుట్టకు వెళ్లే మట్టి రోడ్డు వేయకపోతే దాదాపు ఆ రెండు నిర్మాణాలు చెరువుకు ఆనుకొని ఉండేవి. అయితే ఇక్కడ ఎఫ్‌టీఎల్ పరిధిని గుర్తిస్తే అవి కూడా అందులోకి వస్తాయని స్థానికులు చెబుతున్నారు. ఈ ఆక్రమణలపై ఇమ్మడి పురుషోత్తంరెడ్డి అనే వ్యక్తి హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేశారు. దానిపై గత సంవత్సరం ఆగష్టు 28వ తేదీన కోర్టు ఆర్డర్ ఇచ్చింది. మునిసిపల్ అధికారులు పిటిషనర్, రెస్పాండెంట్ పార్టీలకు నోటీసులు ఇచ్చి వారి వాదనలు విన్న తర్వాత అవసరమైన మేరకు తదుపరి చర్యలు తీసుకోవాలని సూచించింది. ఆ తర్వాత అక్టోబరు నెల 31వ తేదీన విచారణకు ఇరు పార్టీలను పిలువగా పిటిషనర్ హాజరుకాగా రెస్పాండెంట్ అది కబ్జా కాదు అని నిరూపించుకోవడానికి సరైన ధ్రువపత్రాలు సమర్పించడానికి సమయం కోరారు. తర్వాత నవంబర్ 15వ తేదీకి వాయిదా వేయగా అప్పుడు కూడా పిటిషనర్ ఒక్కరే హాజరయ్యారు. కానీ, ఇప్పటివరకు ఆ కోర్టు ఆర్డర్ ప్రకారం చర్యలు మాత్రం మునిసిపల్ అధికారులు తీసుకోలేదు. కమిషనర్ మారడం, ప్రభుత్వం మారడం అన్నీ జరిగిపోయాయి కానీ, ఇప్పటివరకు ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్నచందంగా పరిస్థితి ఉన్నది. ఫిర్యాదులు చేయడం వల్ల కబ్జాదారులను బెదిరించి అధికారులు డబ్బులు వసూలు చేస్తున్నారే కానీ ప్రభుత్వ ఆస్తులను కాపాడటంలో శ్రద్ధలేదనే ఆరోపణలు ఉన్నాయి.

ఆ సర్వే నెంబర్ మొత్తం ప్రభుత్వ భూమే

- నర్సింగ్, ఆర్ఐ, మహబూబ్‌నగర్ అర్బన్ మండలం

ఎనుగొండ శివారులోని సర్వే నెంబర్ 291 మొత్తం ప్రభుత్వ భూమే. ఇందులో చెరువు ఉన్నది. ఇరిగేషన్, రెవెన్యూ శాఖల ఆధ్వర్యంలో ఇటీవల పరిశీలన చేశాము. కొలతలు చేస్తే ఎంతవరకు వస్తుందనేది తేలుతుంది. పంక్షన్ హాల్ అందులోకి వస్తుందా లేదా అనేది మరోసారి వెళ్లి కొలతలు చేసిన తర్వాత నిర్ణయిస్తాం. ఇరిగేషన్, మునిసిపల్, రెవెన్యూ ఆధ్వర్యంలో జరిగితే హద్దులు సరిగా నిర్ణయించవచ్చు.

మట్టి రోడ్డు నిర్మాణాన్ని ఆపాం

- మనోహర్, డీఈ, ఇరిగేషన్ శాఖ

జేజేఆర్ పంక్షన్ హాల్ వెనుక మట్టి పోస్తున్నారని మునిసిపల్ అధికారులకు ఫిర్యాదు వచ్చింది. ఆ ఫిర్యాదు మేరకు సంయుక్తంగా వెళ్లి విచారణ నిర్వహించాం. మట్టి పోసి రోడ్డు వేయడాన్ని నిలిపివేశాం. ఇందులో ఎఫ్‌టీఎల్ ఎంతవరకు వస్తుందనేది కొలతలు చేయాలి. విలేజ్ సర్వే మ్యాపు ప్రకారం చూసి కొలత చేస్తేనే ఎంత ప్రభుత్వ భూమి ఉందో తేలుతుంది.

క్రీడాకారులు జాతీయ స్థాయిలో రాణించాలి


విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న నిర్వాహకులు

లింగాల, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ క్రీడాకారులు దాగి ఉన్న నైపుణ్యాన్ని వెలికితీయడానికి ఇలాంటి పోటీలు దోహదపడుతాయని జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించేందుకు కృషి చేయాలని సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు శ్రీనివాస్‌రావు అన్నారు. ఈ నెల 11 నుంచి లింగాల సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల క్రీడా మైదానంలో కొనసాగుతున్న గురుకులాల పదవ జోనల్ క్రీడలు గురువారం ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా విద్యార్థులకు ఘనంగా వీడ్కోలు పలికారు.

విజేతల వివరాలు

అండర్-14 కబడ్డీలో విజేత అచ్చంపేట, రన్నర్ పెద్దకొత్తపల్లి, ఖోఖోలో విన్నర్ దామరగిద్ద, రన్నర్ లింగాల, టెన్ని కాయిట్ విజేత హేమచరణ్ (బాలానగర్), శ్రీశాంత్(జేపీనగర్), చదరంగం విజేత లింగాల, రన్నర్ జేపీనగర్, క్యారమ్స్ భారత్ పాలే (జేపీ నగర్), రన్నర్ అభినయ్, సిద్దార్థ (పెద్దకొత్తపల్లి), చాంపియన్‌షిప్ అచ్చంపేట నిలిచింది. అండర్-17 విభాగంలో కబడ్డీ విజేత ఇటిక్యాల, రన్నర్ దేవరకద్ర, ఖోఖో విజేత దామరగిద్ద, రన్నర్ జేపీనగర్, వాలీబాల్ విజేత అయిజ, రన్నర్ అచ్చంపేట, బాల్ బ్యాడ్మింటన్ విజేత ఇటిక్యాల, రన్నర్ లింగాల, హ్యాండ్‌బాల్ విజేత బాలానగర్, రన్నర్ అచ్చంపేట, ఫుట్‌బాల్ విజేత వీపనగండ్ల, రన్నర్ లింగాల, టెన్ని కాయిట్ డబుల్స్ నవీన్ (జేపీనగర్), శరత్‌చంద్ర(బాలానగర్), చెస్ విజేత దామరగిద్ద, రన్నర్ గద్వాల, క్యారమ్స్ అజయ్, అరుణ్ (అయిజ), శివశంకర్, చరణ్ (వీపనగండ్ల), చాంపియన్‌షిప్ జేపీనగర్, అండర్-19 విభాగంలో కబడ్డీ విజేత లింగాల, రన్నర్ ఇటిక్యాల, ఖోఖో విజేత జేపీనగర్, రన్నర్ మదనాపురం, వాలీబాల్ విజేత లింగాల, రన్నర్ అయిజ, బాల్ బ్యాడ్మింటన్ విజేత ఇటిక్యాల, రన్నర్ లింగాల, హ్యాండ్ బాల్ విజేత జేపీనగర్, రన్నర్ అయిజ, ఫుట్‌బాల్ విజేత వీపనగండ్ల, రన్నర్ బాలానగర్, టెన్నికాయిట్ విజేత జగదీష్ (బాలానగర్), రన్నర్ నితీష్ (జేపీనగర్), చెస్ విజేత లింగాల, రన్నర్ అయిజ, క్యారమ్స్ చరణ్, ఆకాష్, వ్యక్తిగత విభాగంలో చాంపియన్‌షిప్ అండర్-14లో విశాల్ (మదనాపురం), అండర్-17 మల్లేష్‌నాయక్ (జేపీ నగర్), అండర్-19 గణేష్ (లింగాల) సత్తా చాటారు. అదేవిధంగా అథ్లెటిక్ పోటీల్లో ప్రావీణ్యం కనబర్చిన విజేతలకు బహుమతులను అందజేశారు.

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపిక


విద్యార్థులను అభినందిస్తున్న ఎంఈవో కృష్ణయ్య

కొత్తకోట, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అమడబాకుల, కొత్తకోట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలకు చెందిన ఇద్దరు విద్యార్థులు రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికయ్యారు. కొత్తకోట ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న గణేష్ అమడబాకుల పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న వినత జోనల్ స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచారు. ఈ నెల 16 నుంచి 18వ తేదీ వరకు మెదక్ జిల్లా కేంద్రంలో కొనసాగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు వ్యాయామ ఉపాధ్యాయులు వెంకటేష్ గురువారం తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను ఎంఈవో కృష్ణయ్య, ప్రధానోపాధ్యాయులు వివేకానంద ఉపాధ్యాయ బృందం అభినందించారు.

మైనారిటీ గురుకులాలకు అద్దె భారం


వీరన్నపేటలోని డబుల్ బెడ్‌రూమ్ కాలనీ వద్ద పిల్లర్ల వరకు నిర్మించి వదిలేసిన ఐదు గురుకులాల సముదాయం

(మొదటి పేజీ తరువాయి)

70 శాతానికిపైగా పూర్తయ్యాయి. వీరన్నపేట డబుల్‌బెడ్‌రూం ఇళ్ల కాలనీ వద్ద రెండు బాలికలు, మూడు బాలుర గురుకుల పాఠశాలల భవనాలకు 15 ఎకరాల స్థలం కేటాయించి, 2022లో పనులు మొదలు పెట్టారు. ఈ ఐదు భవనాల నిర్మాణాలు పిల్లర్ల వరకు చేపట్టి, వదిలేశారు. జిల్లాలోని జడ్చర్లలో ఒకటి, దేవరకద్రలో రెండు గురుకులాల నిర్మాణానికి స్థలాలు కేటాయించారు. నాగర్‌కర్నూల్ జిల్లాలోని అచ్చంపేట, కల్వకుర్తిలో ఒక్కోటి, వనపర్తి జిల్లాలో రెండు, గద్వాల, నారాయణపేట జిల్లాల్లో ఒక్కో గురుకులం భవన నిర్మాణాలకు స్థలాలు కేటాయించారు. పనులు ఎప్పుడు మొదలు పెడతారో తెలియని పరిస్థితి ఏర్పడింది.

అద్దెలు చెల్లించలేదని తాళాలు

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 20 మైనారిటీ గురుకుల పాఠశాలలు అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి. ఇటీవలి కాలంలో ప్రభుత్వం నుంచి అద్దె బిల్లులు సకాలంలో విడుదల కాకపోవడంతో భవనాల యజమానులు పాఠశాలలకు తాళాలు వేశారు. ఈ సంవత్సరం అక్టోబరు వరకు 11 నెలల అద్దె పేరుకపోవడంతో యజమానులు పలు చోట్ల తాళం వేశారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రం న్యూటౌన్‌లో ఉన్న మైనారిటీ బాలుర-2 గురుకులానికి తాళం వేయడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

బోయపల్లి గురుకులం త్వరలో ప్రారంభం

జిల్లా కేంద్రంలోని బోయపల్లి వద్ద నిర్మిస్తున్న బాలికల గురుకుల భవనం పనులు తుది దశకు చేరుకున్నాయి. 70 శాతానికి పైగా పనులు పూర్తయ్యాయి త్వరలో ఈ భవనం ప్రారంభిస్తాం. గురుకుల భవనాలకు వచ్చిన కొన్ని నిధులు వెనక్కి వెళ్లాయి. కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి, మిగతా భవనాల పనులు చేపట్టేలా చూస్తాం. ఇవి అందుబాటులోకి వస్తే అద్దె భారం తగ్గుతుంది.

- శంకరచారీ, జిల్లా మైనార్టీ సంక్షేమశాఖ అధికారి

సింగిల్ విండోలో అవినీతిపై విచారణ


సింగిల్ విండో కార్యాలయంలో విచారణ చేస్తున్న అధికారులు

తిమ్మాజిపేట, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): నాగర్‌కర్నూల్ జిల్లా తిమ్మాజిపేట మండల కేంద్రంలోని సింగిల్ విండో కార్యాలయంలో అవినీతి అక్రమాలపై గురువారం డీసీవో అసిస్టెంట్ రిజిస్ట్రార్ అంజమ్మ, సహకార శాఖ సీనియర్ అధికారి పురుషోత్తంరావు, జూనియర్ అసిస్టెంట్ నరేష్‌కుమార్ విచారణ చేపట్టారు. విషయం తెలుసుకున్న రైతులు కార్యాలయం చేరుకుని తాము పొందిన రుణాలు 2021లో చెల్లించెల్లించామన్నారు. బ్యాంకులో మాత్రం తమ పేరిట అప్పుగానే ఉందని ఏం చేయాలో దిక్కుతోచని స్థితిలో ఉన్నామని అధికారుల ఎదుట వాపోయారు. అడ్డగోలుగా నిధులు స్వాహా చేశారని, రైతులకు అందాల్సిన సబ్సిడీలు కాజేశారని, పట్టాదారు పాస్ పుస్తకాలు సైతం మాయం చేశారని ఆరోపించారు. తాము సకాలంలో చెల్లించిన డబ్బును తమ ఖాతాలో జమ చేయక అవినీతికి పాల్పడిన పాలకవర్గంపై అధికారులపై చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. విచారణ అధికారులు మాట్లాడుతూ రూ.3.97 కోట్లు అక్టోబరు నెల 18, 19, 22 తేదీల్లో చెల్లింపులు జరిగినట్లు తెలిపారు. రైతులకు న్యాయం జరిగేలా చూస్తామని, ప్రస్తుతం ప్రాథమిక విచారణ చేశామరన్నారు. రైతులతో మాట్లాడమని, త్వరలో విచారణ నిర్వహించి అవినీతికి పాల్పడిన వారిపై చర్యలు ఉంటాయని తెలిపారు.

మార్కెట్‌లో సౌకర్యాలు కరువు



గద్వాలలోని వ్యవసాయ మార్కెట్ యార్డు కార్యాలయం

గద్వాల, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): ఒకప్పుడు గద్వాల వ్యవసాయ మార్కెట్‌కు ఉమ్మడి జిల్లాలోనే ప్రత్యేక స్థానం ఉండేది. అన్ని ప్రాంతాల రైతుల పంట ఉత్పత్తుల క్రయవిక్రయాలకు నెలవుగా ఉండే మార్కెట్ నేడు వెనకబడిపోతున్నది. మార్కెట్ అభివృద్ధికి నోచుకోకపోవడంతో కొనుగోలుదారులకు, రైతులకు మార్కెట్ అధికారులు భరోసా ఇవ్వలేకపోతున్నారు. అన్ని పంట ఉత్పత్తులు మార్కెట్‌కు వచ్చే పరిస్థితిని కల్పించలేకపోతున్నారు. ఫలితంగా కొనుగోలుదారులు తగ్గిపోవడం, రైతులకు సరైన గిట్టుబాటు ధరలు లేక ఇతర ప్రాంతాలకు పంట ఉత్పత్తులను తీసుకెళ్తుండటంతో మార్కెట్ కళ తప్పుతున్నది. వరి కొనుగోలు కేంద్రాల ద్వారా వచ్చే మార్కెట్ ఫీజును మినహాయిస్తే నేరుగా మార్కెట్‌కు వచ్చే ఆదాయం నిర్వహణ, జీతభత్యాలకే సరిపోయే పరిస్థితి ఉంది. దానికితోడు జీరో దందాను నిలువరించకపోవడం కూడా మార్కెట్ ఆదాయంపై ప్రభావం చూపుతోంది.

వ్యవసాయ మార్కెట్‌కు నేరుగా వచ్చిన పంటలను కమీషన్ మర్చంట్‌ల ద్వారా విక్రయాలు చేయడంతో వచ్చే మార్కెట్ ఫీజు గతేడాది రూ. 2.33కోట్ల వరకు వచ్చింది. ఇందులో వేరుశనగ విక్రయాల ద్వారానే రూ.1.49 కోట్లు ఉంది. మిగిలింది అన్ని పంట ఉత్పత్తులు విక్రయించడం ద్వారా వచ్చిందే. జీరో దందాను నిలువరిస్తేనే ఆదాయం పెరుగుతుంది. మార్కెట్‌కు నాలుగు గేట్లు ఉండటం, సీసీ కెమెరాలు లేకపోవడం, అధికారులు నిర్లక్ష్యంగా ఉండటంతో మార్కెట్ ఆదాయంపై ప్రభావం చూపుతున్నదనే ఆరోపణలు ఉన్నాయి. తక్‌పట్టీ లేకుండా తెల్లకాగితాల మీదనే కమీషన్ వ్యాపారం జరగడం, అదేవిధంగా వ్యాపారులు అనుమతులు లేకుండా ఇతర ప్రాంతాల మార్కెట్‌లకు తరలించడం వలన ఆదాయం కోల్పోతున్నది. ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా కొనుగోలు చేసిన వాటిపై సివిల్‌సప్లయ్ అధికారులు ఇచ్చే మార్కెట్ ఫీజు గతేడాది రూ. 1.61కోట్ల వరకు వచ్చింది. చెక్‌పోస్టుల నిర్వాహణ ద్వారా రూ.24.16 లక్షలు, డైరెక్టు ఎగుమతులు చేయడం ద్వారా రూ.55.65లక్షలు మార్కెట్ ఫీజు వచ్చింది. ఇలా గతేడాది రూ.4.74కోట్ల వరకు మార్కెట్‌కు ఆదాయం వచ్చింది.

తిష్టవేసిన సమస్యలు..

మార్కెట్‌ను అభివృద్ధి చేయాలనే ఆలోచన పాలకవర్గాలకు ఉంటే ముందుగా జీరోదందాకు చెక్‌పెట్టాలి. 12 సంవత్సరాలుగా నిర్వహించిన పాలకవర్గాలు అధికారం చెలాయించాయి తప్ప అభివృద్ధిని పట్టించుకోలేదు. దీంతో మార్కెట్‌లో సమస్యలు తిష్టవేశాయి. రైతులకు తాగునీరు, మరుగుదొడ్లు లేవు. సేదతీరే షెడ్డు శిథిలావస్థకు చేరింది. మార్కెట్‌లోని కమీషన్ మర్చంట్ల షాపులు శిథిలావస్థకు చేరుకొని పెచ్చులు మీదపడుతున్నాయి. సీసీ రోడ్లు, డ్రైనేజీలు లేకపోవడంతో అకాల వర్షాలతో మార్కెట్‌కు వచ్చిన ధాన్యం కొట్టుకుపోతున్నది. ప్రహరీ పడిపోయి పందులు, పశువులు వస్తున్నాయి. గేట్లు దెబ్బతిన్నాయి. వీధి లైట్లు, హైమాస్టు లైట్లు లేక రాత్రిపూట ఇబ్బందులు తప్పడం లేదు. సీసీ కెమెరాలు లేకపోవడంతో ఏదైనా ఘటన జరిగితే రుజువులు లేకుండాపోయింది. ఇవన్నీ చాలా ఏళ్లనుంచి సమస్యలు ఉన్నప్పటికీ పాలకవర్గాలు దృష్టి సారించడం లేదు.

ప్రతిపాదించిన పనులకు బ్రేక్..

గతేడాది పాలకవర్గం మార్కెట్‌లో ఉన్న సమస్యలు పరిష్కరించడానికి అభివృద్ధి పనులకు తీర్మాణాలు చేసింది. రూ.3.89కోట్లతో మార్కెట్‌లో అభివృద్ధి పనులు చేపట్టాలని అనుమతులు తెచ్చుకొని టెండర్లు పిలిచింది. కానీ ఆలోపే అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికలు రావడం, బీఆర్ఎస్ ప్రభుత్వం పోయి కాంగ్రెస్ ప్రభుత్వం రావడంతో పనులకు బ్రేక్ పడింది.

పనులు చేపట్టేందుకు టెండర్లు పిలిచాం



మార్కెట్‌లో పలు అభివృద్ధి పనులు చేయడానికి అనుమతులు తీసుకున్నాం. టెండర్లు పిలిచాం.. ఎన్నికలు రావడం, ప్రభుత్వం మారడంతో పనులు ప్రారంభం కాలేదు. మార్కెట్‌లో జీరో దందాను నిలువరిస్తున్నాం. అక్రమంగా వెళ్లే సరకులను చెక్‌పోస్టుల వద్ద పట్టుకొని మార్కెట్ ఫీజు వసూలు చేస్తున్నాం.

- నర్సింహులు, మార్కెట్ కార్యదర్శి, గద్వాల

కర్షకుడికి కష్టాలు

- ధాన్యం ఆరబోసేందుకు స్థలాలు కరువు
- ఆపత్కాలంలో భద్ర పరిచేందుకు తప్పని తిప్పలు
- కొనుగోళ్లపైనే అధికారుల శ్రద్ధ
- రైతుల కష్టాలు తీరేనా ?


కృష్ణానది పుష్కర ఘాటు వద్ద ఆరబోసిన ధాన్యం

పెబ్బేర్ రూరల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాల్లో ప్రతీ ఏటా రైతులకు కష్టాలు తప్పడం లేదు. అకాల వర్షాలకు ధాన్యం తడిసి రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. టార్పాలిన్లు అందించకపోవడం, ధాన్యం ఆరపోసుకోవడానికి స్థలాలు లేక రైతులు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు ధాన్యం కొనుగోలు చేయటంపైనే దృష్టి సారించారే తప్ప రైతుల ఇబ్బందులను తొలగించే అంశాలపై చర్యలు తీసుకోవడంలేదని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొనుగోలు కేంద్రాలకు ఎన్ని మెట్రిక్ టన్నుల ధాన్యం కేంద్రాలకు తీసుకొస్తారు? ఎన్ని కేంద్రాలు ఏర్పాటు చేయాలి, సన్న రకం ధాన్యాన్ని గుర్తించేందుకు పరికరాల వినియోగం వంటి వాటిపై అధికారులు దృష్టి సారించారు. జిల్లా వ్యాప్తంగా పీఏసీఎస్, ఐకేపీ, మెప్మా ఆధ్వర్యంలో 244 కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు సిద్ధం చేశారు.

సమస్యలపై దృష్టి సారించాలి..

గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు ముఖ్యంగా స్థలాల కొరత రైతులను వేధిస్తుంది. ఉన్న స్థలంలో ధాన్యం ఆరబోసేందుకు ఇబ్బందులు పడుతున్నారు. కొందరు రైతులు ఇళ్ల ముందు, రహదారులపై ధాన్యం ఆరబోసుకుంటున్నారు. అధికారులు, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు మొక్కుబడిగా కేంద్రాలను ఏర్పాటు చేసి చేతులు దులుపుకుంటున్నారు. కేంద్రాల్లో టార్పాలిన్ కవర్లు లేక వర్షానికి, రైతు లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ ఏడాది కూడా టార్పాలిన్ కవర్లు అందించండం లేదు.

ప్రతీ ఏటా గోనెసంచుల కొరతతో వారాల తరబడి ధాన్యాన్ని తూకం చేయకుండా కేంద్రాల్లోనే నిల్వ ఉంచుతున్నారు. మరో పక్కన లారీల కొరత కారణంగా కొనుగోలు చేసిన ధాన్యాన్ని మిల్లులకు తరలించకపోవడంతో అకాల వర్షాలకు ధాన్యం తడిసిపోతున్నది. తడిన ధాన్యం మిల్లర్లు తిరస్కరిస్తున్నారు. కేంద్రాల్లో ధాన్యం తూకం చేయుటకు నిర్వాహకులు తేమ శాతాన్ని పరిశీలిస్తారు. సన్నరకం 14 శాతం, దొడ్డు రకం 17 శాతం తేమ ఉంటేనే తూకం చేస్తారు. అలాంటిది తూకం చేసిన ధాన్యాన్ని లారీలకు ఎత్తే మిల్లర్ల దగ్గరకు తరలిస్తే తేమ శాతం ఎక్కువగా ఉందని మిల్లుల దగ్గర ధాన్యాన్ని దించుకోకుండా లారీలను తిరిగి కొనుగోలు కేంద్రాలకు పంపిస్తున్నారు. తరుగు తీస్తేనే ధాన్యం మిల్లుల దగ్గర దించుకుంటామని మిల్లర్లు చెప్పడంతో తరుగు తీస్తున్నారు. అధికారులు కూడా మిల్లర్లకే మద్దతు పలుకుతున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వ నిబంధనల ప్రకారం కొనుగోలు కేంద్రాల వద్ద ఐదుగురు నిర్వాహకులు ఉండాలి. కేవలం ఒకరిద్దరితోనే కొనుగోలు చేస్తున్నారు. దీంతో ధాన్యం సేకరణ ఆలస్యమవుతోందని రైతులు ఆరోపిస్తున్నారు. కొన్ని కేంద్రాల్లో తూకం చేసి నిల్వ ఉంచిన ధాన్యం బస్తాలు గత సీజన్‌లో చోరీకి గురయ్యాయి. ఆ నష్టాన్ని రైతులపైనే నెడుతున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇబ్బందులు లేకుండా కొనుగోలు చేపడతాం..

జిల్లాలో ఇప్పటి వరకు 184 కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాం. 701 క్వింటాళ్ల ధాన్యం సేకరించాము. కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చిన ధాన్యాన్ని ప్రభుత్వ నిబంధనల ప్రకారం తేమ శాతం వస్తే తూకాలు చేస్తున్నాం. టార్పాలిన్ కవర్లు మార్కెటింగ్ అధికారులు సరఫరా చేయవలసి ఉంటుంది. ప్రభుత్వం నుంచి సరఫరా చేయలేదు. రైతులకు ఇబ్బంది లేకుండానే ధాన్యం సేకరిస్తున్నాం.

- రమేష్, పౌరసరఫరాల శాఖ అధికారి, వనపర్తి జిల్లా

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరి మృతి

- ఒకరికి తీవ్ర గాయాలు

కల్వకుర్తి/కొత్తకోట, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి చెందిన సంఘటన గురువారం చోటుచేసుకున్నది. వనపర్తి జిల్లాలో ఒకరు, నాగర్‌కర్నూల్ జిల్లాలో మరొకరు మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నాగర్‌కర్నూల్ డిండి మండలం వీరబోయినపల్లి గ్రామానికి చెందిన బాలస్వామి, స్వాతి దంపతులు 30 ఏళ్లుగా కల్వకుర్తి పట్టణంలోనే నివసిస్తున్నారు. గురువారం దంపతులు ఇద్దరు బైక్‌పై కల్వకుర్తి నుంచి అచ్చంపేటకు బయలు దేరారు. శ్రీశైలం జాతీయ రహదారిపై కొండారెడ్డి పల్లి గేటు వద్ద బాలస్వామి బైకును దేవరకొండ నుంచి వచ్చే కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో స్వాతి(38) అక్కడికక్కడే మృతి చెందగా బాలస్వామి గాయపడ్డారు. స్వాతి మృతదేహాన్ని కల్వకుర్తి ఆసుపత్రికి తరలించారు. సంఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వనపర్తి జిల్లా కొత్తకోట మండలంలోని ముమ్మళపల్లి గ్రామ శివారులోని జాతీయ రహదారిపై బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం చెందాడు. కొత్తకోట ఎస్సై మంజునాథ్‌రెడ్డి తెలిపి వివరాల మేరకు అమడబాకుల గ్రామానికి చెందిన మండడి శివ కుమార్ (24) భార్యతో ఘర్షణ పడి దాబా వద్ద భోజనం చేసేందుకు బైక్‌పై వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో హైదరాబాద్ వైపు వెళ్తున్న గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టింది. రోడ్డుపై పడి ఉన్న శివకుమార్‌పై వాహనాలు వెళ్లడంతో శవం నుజ్జునుజ్జైంది. విషయం తెలుసుకొని సంఘటన స్థలానికి చేరుకున్నాము. బైక్ నంబరు ఆధారంగా మృతుడిని గుర్తించి బంధువులకు సమాచారం అందించాము. కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని జిల్లా ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై తెలిపారు. శివకుమార్‌కు భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు.

రైతులంటే నిర్లక్ష్యమా?

గోపాల్‌పేట, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : పంటలు పండించే రైతులంటే అంత నిర్లక్ష్యమా అని జిల్లా అదనపు (రెవెన్యూ) కలెక్టర్ వెంకటేశ్వర్లు కొనుగోలు నిర్వాహ కులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం మండల కేంద్రంలో కొనుగోలు కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. మౌలిక సదుపాయలు లేకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి నాలుగు రోజులు గడుస్తున్నా... వడ్లను ఎందుకు కొనలేదని అసహనం వ్యక్తం చేశారు. మండల కేంద్రానికి చెందిన ఓ మహిళ రైతు 12 రోజులుగా కొనుగోలు కేంద్రం వద్ద పడిగాపులు కాస్తున్నామని, తాగడానికి నీళ్లు కూడా ఏర్పాటు చేయలేదని అదనపు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. తక్షణమే తాగునీరు, టెంటు ఏర్పాటు చేయాలని ఏపీఎం చంద్రకళను ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కుమార్ రెడ్డి, ఆయా శాఖల అధికారులు ఉన్నారు.


తేమ శాతాన్ని పరీక్షిస్తున్న అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవాలి

జిల్లా న్యాయాధికారి డీ రాజేష్‌బాబు


కార్యక్రమం అనంతరం విద్యార్థులతో జిల్లా న్యాయాధికారి

కందనూలు, నవంబరు 14(ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు బాల్యాన్ని ఆనందంగా గడుపుతూ భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవాలని జిల్లా న్యాయాధికారి డీ రాజేష్‌బాబు అన్నారు. జిల్లా కేంద్రం లోని జడ్పీహెచ్ఎస్ ఆవరణలో గురువా రం బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. జవహర్‌లాల్ నెహ్రూ చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. దేశంలో బాలలకు పలు హక్కులు ఉన్నాయని, వాటిని పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందని అన్నారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో విద్యార్థులతో జరిగిన న్యాయ సేవాసదన్‌లో ఆయన మాట్లాడారు. ఉచిత న్యాయ సేవల కోసం 15100 టోల్ ఫ్రీ నెంబరును సంప్రదించాలని సూచించారు. రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు జిల్లాలో పలు కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. కార్యక్రమంలో డీఈవో గోవింద రాజులు, పీపీ బ్రహ్మేశ్వర్‌రావు, న్యాయవాది మధుసూదన్‌రావు తదితరులు ఉన్నారు.

ఇరుకు గదుల్లో ఇక్కట్లు

» నిధుల కొరతతో నిలిచిన నూతన భవన నిర్మాణం



నారాయణపేట గ్రంథాలయం

నారాయణపేట జిల్లా కేంద్ర గ్రంథాలయం ఇరుకు గదుల్లో, అరకొర వసతుల మధ్య కొనసాగుతోంది. ఇక్కడ 17,300 పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. ప్రతీ రోజూ 50 మందికి పైగా పాఠకులు వస్తుంటారు. మూత్రశాలలు, మరుగుదొడ్లు లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రంథాలయం కోసం పట్టణ శివారులోని ఎర్రగుట్ట వద్ద రెండు కోట్ల రూపాయల వ్యయంతో చేపట్టిన నూతన భవన నిర్మాణం నిధుల కొరతతో నిలిచి పోయింది.

అందరి సహకారంతో అభివృద్ధి



అందరి సహకారంతో గ్రంథాలయాన్ని అభివృద్ధి చేయ డమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నాం. అసంపూర్తిగా ఉన్న నూతన భవన నిర్మాణాన్ని మునిసిపల్ నిధులతో పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. అవసరం మేరకు పూర్తి స్థాయి సిబ్బందిని నియమించి, అదర్శ గ్రంథాలయంగా తీర్చిదిద్దుతాం.

- వార్ల విజయ్‌కుమార్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్, పేట

'ఒకటి'దే పెద్ద సమస్య

» మూత్రశాల ఒకటే ఉండటంతో ఇబ్బంది



గ్రంథాలయంలో చదువుకుంటున్న యువతీ, యువకులు

వనపర్తి జిల్లా కేంద్రంలోని సురవరం ప్రతాపరెడ్డి స్మారక గ్రంథాయానికి నూతన భవనం ఏడాది క్రితం అందుబాటులోకి వచ్చింది. కానీ మహిళలు, పురుషులకు ఒకే మూత్రశాల ఉండటంతో తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. పోటీ పరీక్షలకు సన్నద్ధం అవుతున్న వారు ప్రతీ రోజు వంద నుంచి 120 మంది వరకు వస్తున్నారు. వారితోనే హాల్ మొత్తం నిండిపోవడంతో దినపత్రికలు చదివే వారు కూర్చునేందుకు స్థలం సరిపోవడం లేదు.

త్వరలో మూత్రశాలల నిర్మాణం



జిల్లా గ్రంథాలయంలో అదనంగా మరో మూడు మూత్రశాలలు, మరుగుదొడ్లు నిర్మించాల్సి ఉంది. ఈ విషయాన్ని కలెక్టర్, మంత్రి, ఎమ్మెల్యేల దృష్టికి తీసుకెళ్లాం. నిధులు మంజూరు చేస్తున్నట్లు వారు తెలిపారు. ఇంకా ప్రొసీడింగ్ రాలేదు, రాగానే పనులు ప్రారంభిస్తాం.

- గోవర్ధన్ సాగర్,
జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్, వనపర్తి



మహబూబ్‌నగర్ జిల్లా కేంద్ర గ్రంథాలయంలో చదువుకుంటున్న యువతీ యువకులు

భవితకు బాటలు

» గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు » పాఠకులకు అందుబాటులో వేలాది పుస్తకాలు

» పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే వారికి అవసరమైన మెటీరియల్ » గురువారం నుంచి ప్రారంభమైన వారోత్సవాలు

విజ్ఞాన భాండాగారాలు, ఆధునిక దేవాలయాలు అయిన గ్రంథాలయాలు యువత భవితకు బాటలు వేస్తున్నాయి. విద్యార్థులు, ఉద్యోగార్థులు, సాహితీప్రియులతో పాటు సాధారణ పాఠకులకు అవసరమైన అన్ని పుస్తకాలు, దినపత్రికలు అందుబాటులో ఉంటున్నాయి. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా ఆధునిక వసతులనూ సంతరించుకుంటున్నాయి. పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న వారికి అవసరమైన పుస్తకాలనూ అందిస్తున్నాయి. దీంతో అభ్యర్థులు రోజంతా అక్కడే ఉండి పరీక్షలకు సిద్ధం అవుతున్నారు. గ్రంథాలయ వారోత్సవాలు గురువారం నుంచి ప్రారంభమయ్యాయి. ఈ నేపథ్యంలో ఉమ్మడి పాలమూరు జిల్లా పరిధిలోని మహబూబ్‌నగర్, నారాయణపేట, వనపర్తి, జోగుళాంబ గద్వాల, నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్ర గ్రంథాలయాలను 'ఆంధ్రజ్యోతి' గురువారం విజిట్ చేసింది. అక్కడి వసతులు, సమస్యలను తెలుసుకున్నది. ఆ వివరాలు మీ కోసం...

- మహబూబ్‌నగర్ విద్యావిభాగం, నారాయణపేట, గద్వాల టౌన్, వనపర్తి రాజీవ్ చౌరస్తా, నాగర్‌కర్నూల్ టౌన్

పాఠకులతో కళకళ

» మహబూబ్‌నగర్ శాఖా గ్రంథాలయంలో ఆధునిక వసతులు

» అందుబాటులో 55 వేల పుస్తకాలు



మహబూబ్‌నగర్ పట్టణంలోని
జిల్లా కేంద్ర గ్రంథాలయం

మహబూబ్‌నగర్ పట్టణంలోని జిల్లా కేంద్ర గ్రంథాలయంతో పాటు, రాంనగర్ చౌరస్తాలోని గ్రంథాలయం నిత్యం పాఠకులతో కళకళలాడుతున్నాయి. విద్యార్థులు, నిరుద్యోగులు, సాహితీప్రియులు, పఠనాసక్తి ఉన్న వారు ప్రతీ రోజూ మూడు వందల మందికి పైగా పాఠకులు వస్తున్నారు. జిల్లా కేంద్ర గ్రంథాలయంలో వివిధ రకాలైన సంబంధించిన 55 వేల పుస్తకాలు ఉన్నాయి. తెలుగు, హిందీ, ఆంగ్లం, ఉర్దూ దినపత్రికలు 24 ప్రతీ రోజూ వస్తున్నాయి. గ్రూప్స్, సివిల్స్, బీఎడ్, డీఎడ్, రైల్వే, పోలీస్, ఎప్‌సెట్ తదితర పోటీ పరీక్షలకు అవసరమైన పోటీ పరీక్షలకు అవసరమైన పుస్తకాలు అందుబాటులో ఉండటంతో నిరుద్యోగులు రోజంతా అక్కడే ఉండి చదువుకుంటున్నారు. వారి సౌకర్యం కోసం 22 కంప్యూటర్లు ఉన్నాయి. వైఫై సదుపాయాన్ని కూడా ఉచితంగా అందిస్తున్నారు. సెలవు రోజుల్లోనూ గ్రంథాలయం తెరిచే ఉండటం వల్ల వారికి మరింత ప్రయోజనం కలుగుతోంది. దీంతో పేద విద్యార్థులు, నిరుద్యోగులకు గ్రంథాలయం వరంగా మారింది. ఈ నెల 14 నుంచి 20 వరకు వారోత్సవాలు కొనసాగనున్నాయి. ఉత్సవాల్లో భాగంగా 15న పుస్తక ప్రదర్శన, 16న ఉపన్యాసం, 17న డ్రాయింగ్, 18న వ్యాసరచన, 19న రంగోలి పోటీలు నిర్వహించనున్నారు. 20వ తేదీన బహుమతుల ప్రదానంతో వారోత్సవాలు ముగియనున్నాయి.

గ్రంథాలయానికి రోజూ వస్తా



అంజనేయులు : నేను గ్రూప్ పరీక్షల కోసం సిద్ధం అవుతున్నాను. ప్రతీ రోజు ఇక్కడికే వచ్చి చదువుకుంటున్నాను. మాకు అవసరమైన అన్ని రకాల పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. కంప్యూటర్స్ ఉన్నాయి కానీ, వైఫై సరిగా రావడం లేదు. దాన్ని సరిచేస్తే బాగుంటుంది.

వసతులు బాగున్నాయి



అక్షయ : నేను పోటీ పరీక్షలకు సిద్ధం అవుతున్నా. జిల్లా కేంద్ర గ్రంథాలయానికి రోజు వస్తాను. ఇక్కడ అవసరమైన అన్ని పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. కూర్చొని చదువుకునేందుకు మెరుగైన వసతులు ఉన్నాయి. అప్‌డేట్ మోడల్ బుక్స్ తెప్పిస్తే మాకు మరింత ప్రయోజనకరంగా ఉంటుంది.

అభివృద్ధికి నోచుకోని గ్రంథాలయం

» నత్తనడకన నూతన భవన నిర్మాణం



గ్రంథాలయంలోని ప్రత్యేక గదిలో చదువుకుంటున్న మహిళలు

జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్ర గ్రంథాలయానికి సాధారణ పాఠకులతో పాటు పోటీ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థుల సంఖ్య గణనీయంగా పెరిగింది. ఇక్కడ దాదాపు 24 వేల పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. కానీ కూర్చునేందుకు స్థలం సరిపోక పాఠకులు ఇబ్బంది పడుతున్నారు. గ్రంథాలయం కోసం రూ.1.60 కోట్ల వ్యయంతో చేపట్టిన నూతన భవన నిర్మాణం ఏడాది క్రితం ప్రారంభ మైనా, ఇప్పటికీ బేస్‌మెంట్ వరకే పరిమితమైంది.

భవన నిర్మాణ పూర్తికి చర్యలు



జిల్లా కేంద్ర గ్రంథాలయ భవన నిర్మాణ పనులను త్వరలోనే పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నాం. ప్రజా ప్రతినిధుల సహకారంతో భవన నిర్మాణం పూర్తి చేస్తాం. త్వరలోనే జిల్లాలోని అన్ని గ్రంథాలయాలను పరిశీలించి అవసరమైన అభివృద్ధి పనులు చేపట్టేం దుకు ప్రణాళికను సిద్ధం చేస్తాం.

- నీలి శ్రీనివాసులు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్, గద్వాల

వసతులు లేక అవస్థలు

» అసంపూర్తిగా నూతన భవన నిర్మాణం



జిల్లా గ్రంథాలయంలో చదువుకుంటున్న యువతీ యువకులు

నాగర్‌కర్నూల్ జిల్లా గ్రంథాలయాన్ని పాత మునిసిపాలిటీ భవనంలో కొనసాగిస్తున్నారు. అందులోని చిన్న గదుల్లో పాఠకులు కూర్చునేందుకు స్థలం సరిపోవడం లేదు. లైబ్రరీలో దాదాపు 16 వేల పుస్తకాలున్నాయి. కానీ పోటీ పరీక్షలకు అవసరమైన పుస్తకాలు లేకపోవడంతో అభ్యర్థులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కంప్యూటర్లు ఉన్నా స్థలం సరిపోక వినియోగించుకోవడం లేదు. జిల్లా గ్రంథాలయం కోసం చేపట్టిన నూతన భవన నిర్మాణ పనులు మూడేళ్లుగా కొనసాగుతూనే ఉన్నాయి.

త్వరలో నూతన భవనంలోకి మారుస్తాం



నేను ఇటీవలే బాధ్యతలు చేపట్టాను. జిల్లా మంత్రి, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఉన్నతాధికారుల సహకారంతో ఆర్థిక వనరులను సమకూర్చుకుని, అవసరమైన అన్ని పుస్తకాలను అందుబాటులోకి తీసుకొస్తాం. నూతన భవన నిర్మాణ పనులను నెల రోజుల్లో పూర్తి చేయించి, అందుబాటులోకి తీసుకొస్తాం.

- రాజేందర్, జిల్లా గ్రంథాలయాల సంస్థ చైర్మన్, నాగర్‌కర్నూల్

క్రైం కార్నర్

అమ్మ కాటికి.. నాన్న జైలుకు

» మేనమామ ఇంటికి ఇద్దరు చిన్నారులు

నవాబ్‌పేట, నవంబరు 14(ఆంధ్రజ్యోతి) : క్షణికావేశం ఓ కుటుంబాన్ని విచ్ఛిన్నం చేసింది. తల్లి కాటికి చేరగా, తండ్రి జైలు పాలయ్యాడు. ఈ విషాద సంఘటన మహబూబ్‌నగర్ జిల్లా నవాబ్‌పేట మండల కేంద్రంలో గురువారం చోటు చేసుకుంది. మండల కేంద్రానికి చెందిన ఎరుకలి మల్లేష్ ఈనెల 12న భార్య లక్ష్మీని కర్రతో బలంగా మోది చంపేశాడు. సమాచారం అందుకున్న బంధువులు పిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసిన పోలీసులు, గురువారం అతడిని అదుపులోకి తీసుకున్నారు. మరో వైపు లక్ష్మి అంత్యక్రియలు ముగిశాక బంధువులు ఎవరింటికి వారు వెళ్లిపోయారు. దీంతో వారి పిల్లలు శశివర్ధన్, వర్షితలు అటు ఇటూ తిరుగుతుండటం అందరినీ కంటతడి పెట్టించింది. చివరకు వారిద్దరినీ మేనమామ ఆదరించి, తన ఇంటికి తీసుకువెళ్లాడు.

బైక్‌లో చెలరేగిన మంటలు

» కిందకు దూకి ప్రాణాలు కాపాడుకున్న కుటుంబం



కాలిపోయిన ద్విచక్ర వాహనం

వనపర్తి రూరల్, నవంబరు14 (ఆంధ్రజ్యోతి) : ఓ వ్యక్తి భార్య, పిల్లలతో కలిసి బైక్‌పై వెళ్తుండగా, అందులో నుంచి మంటలు చెలరేగాయి. వారు అప్రమత్తమై వెంటనే కిందకు దూకడంతో ప్రాణాలు దక్కాయి. వనపర్తి జిల్లా పానుగల్ మండల కేంద్రానికి చెందిన పుట్ట మహేష్ కురుమూర్తి జాతరకు వెళ్లేందుకు గురువారం భార్య, ఇద్దరు పిల్లలతో ద్విచక్రవాహనంపై బయలుదేరాడు. దారిలో పెట్రోల్ పోయించుకున్నాడు. మెట్టుపల్లి శివారులోకి రాగానే బండిలో నుంచి ఆకస్మికంగా మంటలు చెలరేగాయి. గమనించిన మహేష్, భార్య పిల్లలతో కిందికి దూకాడు. అప్పటికే బండి మంటలు ఎక్కువయ్యాయి. చుట్టుపక్కల వారు గమనించి నీరు చల్లి ఆర్పేశారు. అప్పటికే అది పూర్తిగా కాలిపోయింది. దీంతో వారు బండిని అక్కడే వదిలేసి జాతరకు వెళ్లిపోయారు.

రైతు ఇంట్లో బంగారం చోరీ

గట్టు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా గట్టు మండల పరిధిలోని పెంచికలపాడుకు చెందిన రైతు ఇంట్లో దొంగలు చొరబడి బంగారం ఎత్తుకెళ్లారు. గ్రామానికి చెందిన బోయ నర్సింహులు బుధ వారం ఇంటికి తాళం వేసి కుటుంబసభ్యులతో కలిసి పొలానికి వెళ్లా రు. సాయంత్రం తిరిగి వచ్చే సరికి ఇంటి తాళం పగుల గొట్టి ఉంది. ఇంట్లోకి వెళ్లి పరిశీలించగా, మూడున్నర తులాల బంగారం చోరీకి గురైనట్లు గుర్తించారు. ఈ మేరకు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

మిడ్జిల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా మిడ్జిల్ మండల కేంద్రం సమీపంలో గురువారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. ఎస్ఐ శివనాగేశ్వర్ నాయుడు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఉర్కొండ మండలం ముచ్చర్లపల్లి గ్రామానికి చెందిన బక్క చంద్రశేఖర్ ద్విచక్ర వాహ నంపై పోలేపల్లి సెజ్‌కు వెళ్తుండగా, మిడ్జిల్ శివారులో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. అతడి సోదరి జ్యోతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

జాతీయ స్థాయి పోటీల్లో విజేతగా నిలవాలి

» ఏఎంవో దుంకుడు శ్రీనివాస్ » మధ్యప్రదేశ్‌కు బయలు దేరిన రాష్ట్ర జట్టు



మధ్య ప్రదేశ్‌కు వెళ్లనున్న రాష్ట్ర జట్టు క్రీడాకారులతో ఏఎంవో దుంకుడు శ్రీనివాస్

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, నవంబరు 14 : జాతీయ స్థాయి కబడ్డీ టోర్నీలో రాష్ట్ర జట్టు విజేతగా నిలవాలని ఏఎంవో దుంకుడు శ్రీనివాస్ అన్నారు. మధ్యప్రదేశ్ రాష్ట్రంలో ఈ నెల 16 నుంచి 20వ తేదీ వరకు నిర్వహించనున్న జాతీయ స్థాయి ఎస్‌జీఎఫ్ అండర్ - 17 బాలికల కబడ్డీ టోర్నీలో పాల్గొనే బాలికల జట్టు తరలివెళ్లింది. ఈ సందర్భంగా గురువారం మహబూబ్‌నగర్ పట్టణంలోని బాలుర కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో శ్రీనివాస్ మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని, క్రీడాకారులకు బంగారు భవిష్యత్తు ఉంటుందని తెలిపారు. జాతీయ స్థాయి టోర్నీలో ప్రతిభ చాటాలని, క్రీడా కోటాలో ఉన్నత, ఉద్యోగావకాశాలు లభిస్తాయని తెలిపారు. బాలికలు అన్ని రంగాల్లో రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ అండర్-17 సెక్రటరీ శారదాబాయి, అండర్-19 సెక్రటరీ పాపిరెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు జగన్‌మోహన్‌గౌడ్, పీడీ రాజవర్ధన్‌రెడ్డి, మేనేజర్, కోచ్ శివాని, కురుమయ్య పాల్గొన్నారు.

తెలంగాణ బాలికల జట్టు

బాలికల జట్టులో నందిని, శివమణి, గంగ, కావేరి (మహబూబ్‌నగర్), సౌ నాలి, సాత్విక (ఆదిలాబాద్), హనీ, మిస్త్రీ (ఖమ్మం), హప్సా, పూజ (నల్గొండ), సాక్షి (రంగారెడ్డి), వందన (కరీంనగర్) ఉన్నారు.

పునరావాసంలో ప్లాట్ల వివాదం

» ఇరువర్గాల మధ్య ఘర్షణ » పోలీసులకు ఫిర్యాదులు



వివాదానికి కారణమైన స్థలం

గట్టు, నవంబరు 14 ఆంధ్రజ్యోతి : జోగుళాంబ గద్వాల జిల్లా, చిన్నోనిపల్లి పునరావాస కేంద్రంలో ప్లాట్ల వివాదం చిలికి చిలికి గాలి వానలా మారి, ఘర్షణకు దారి తీసింది. పునరావాస కేంద్రంలో ప్రభుత్వం నిర్వాసితులకు పంపిణీ చేయగా మిగిలిన 60, 90, 91 ప్లాట్లను కొందరు కబ్జా చేశారంటూ గౌడ సామాజిక వర్గానికి చెందిన వారు రెండు రోజులు క్రితం కలెక్టర్‌తో పాటు, తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. కానీ అధికారులు ఎలాంటి చర్యలూ తీసుకోలేదు. దీంతో గురువారం పలువురు గౌడ సామాజిక వర్గానికి చెందిన వారు ప్లాట్లలో పాతేందుకు బండలను తీసుకొని అక్కడికి చేరుకున్నారు. మరో వర్గం వారు అడ్డుకొని బండలను ధ్వంసం చేశారు. దీంతో ఇరువర్గాల మధ్య ఘర్షణ చెలరేగింది. పరస్పరం దాడులు చేసుకోవడంతో పలువురికి గాయాలయ్యాయి. సంఘటనపై ఇరు వర్గాల వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

700 కిలోల నల్లబెల్లం పట్టివేత

» 20 కిలోల నవసాగరం స్వాధీనం, నిందితుల అరెస్ట్

మహబూబ్‌నగర్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : కిరాణం సరుకుల మధ్య నల్లబెల్లం, నవసాగరం తరలిస్తున్న ముఠాను ఎక్సైజ్ పోలీసులు పట్టుకున్నారు. ఎక్సైజ్ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఎన్‌ఫోర్స్‌మెంట్, ఎక్సైజ్ పోలీసులకు పక్కా సమాచారం అందడంతో గురువారం తెల్లవారుజామున నాలుగు గంటల సమయంలో పాలమూరు పట్టణంలోని బైపాస్ రహదారిలో వాహనాలను తనిఖీ చేశారు. అదే దారిలో వచ్చిన గూడ్స్ వాహనాన్ని అనుమానించి తనిఖీ చేశారు. అందులో కిరాణ సరుకులతో పాటు 702 కిలోల నల్లబెల్లం, 20 కిలోల నవసాగరం ఉన్నట్లు గుర్తించారు. టీడీగుట్టకు చెందిన రాములు, హన్వాడకు చెందిన రాజు వాటిని హైదరాబాద్ నుంచి తీసుకువచ్చి సారా తయారీకి వినియోగిస్తున్నట్లు విచారణలో తేలింది. వారితో పాటు డ్రైవర్ మహేశ్‌ను కూడా అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు. తనిఖీల్లో ఎక్సైజ్ సీఐలు వీరారెడ్డి, శారద, ఎస్ఐ సృజన్, సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.



తనిఖీలో పట్టుబడిన నిందితులతో ఎక్సైజ్ పోలీసులు

బసవోజు దేవేంద్రాచారికి
గ్లోబల్ లీడర్‌షిప్ పురస్కారం



ఎంపీ మల్లురవి నుంచి పురస్కారం అందుకుంటున్న దేవేంద్రాచారి

నాగర్‌కర్నూల్ టౌన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రానికి చెందిన బసవోజు దేవేంద్రాచారి విశ్వకర్మ గ్లోబల్ లీడర్‌షిప్ పురస్కారానికి ఎంపికయ్యారు. డిల్లీలోని అంబేడ్కర్ ఆడిటోరియంలో బుధవారం రాత్రి జరిగిన విశ్వకర్మ గ్లోబల్ లీడర్‌షిప్ అవార్డు ప్రదానోత్సవంలో మల్లు రవి చేతుల మీదుగా ఆయన పురస్కారాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనను పురస్కారానికి ఎంపిక చేసినందుకు నూతన ఆవిష్కరణలపై మరింత ఆసక్తి పెరిగిందన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీల్లో సత్తా చాటాలి

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, నవంబరు 14 : రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ టోర్నీలో జిల్లా క్రీడాకారులు సత్తా చాటాలని డీవైఎస్‌వో శ్రీనివాస్ అన్నారు. ఖమ్మంలో జిల్లా శుక్రవారం నుంచి ప్రారంభం కానున్న రాష్ట్ర స్థాయి ఎస్‌జీఎఫ్ అండర్-14 అథ్లెటిక్స్‌లో టోర్నీలో పాల్గొనేందుకు ఉమ్మడి జిల్లా బాల, బాలికల జట్లు గురువారం తరలివెళ్లాయి. ఈ సందర్భంగా జిల్లా స్టేడియంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన క్రీడాకారులను అభినందించారు. అనంతరం మాట్లాడుతూ జిల్లాలో ప్రతిభ గల క్రీడాకారులకు కొదవలేదన్నారు. ఎంతో మంది క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించారని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ అండర్-19 సెక్రటరీ శారదా బాయి, తెలంగాణ వ్యాయామ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దూమర్ల నిరంజన్, వ్యాయమ ఉపాధ్యాయులు మెర్సీ, బాల్‌రాజ్, మోయిన్ పాల్గొన్నారు.

ఇంటర్వ్యూ..



ఆధునిక పద్ధతులతో అధిక దిగుబడి

- అనీల్‌కుమార్, మండల వ్యవసాయ అధికారి

మూసాపేట, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): పంటల సాగులో ఆధునిక వ్యవసాయ పద్ధతులు, శాస్త్ర సాంకేతిక విధానాలతో అధిక దిగుబడి పొందవచ్చని మండల వ్యవసాయాధికారి అనీల్‌కుమార్ అన్నారు. మరిన్ని వివరాలు ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూలో వెల్లడించారు.

రబీ సీజన్‌లో ఏ పంటలు సాగుచేయాలి?

రబీ సీజన్‌లో వేరుశనగ, ఆముదం, మొక్కజొన్న, మినుము పంటలను సాగు చేస్తే అధిక దిగుబడి వచ్చే అవకాశాలు ఉన్నాయి.

తెగుళ్లు రాకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి?

వరితో పాటు ఇతర పంటలకు పొగాకు లద్దెపురుగులు, వేరుకుళ్లు, కాండంతొలుచు తెగుళ్లు వ్యాపించే అవకాశాలు ఉన్నాయి. రైతులు అప్రమత్తంగా ఉండి ఏఈవోలతో సమస్యలు తెలియజేయాలి. వారు తెలిపే సలహాలు, సూచనలు పాటించి, మందులు పిచికారీ చేయాలి.

ఎలాంటి పద్ధతులు అవలంభిస్తే దిగుబడి పెరుగుతుంది?

డ్రమ్ సీడర్ పద్ధతిలో వరి సాగు చేయడం వల్ల ఎకరాకు రూ.7నుంచి రూ.8వేలు ఖర్చు ఆదా అవుతుంది. అలాగే ప్రస్తుతం చలికాలం కావడం వల్ల వరి నారుమడులను ప్రత్యేక యాజమాన్య పద్ధతుల్లో పెంచుకోవాలి. రైతులు దీన్ని గమనించకపోతే పంటతో పాటు పెట్టుబడి కూడా నష్టపోతారు. అధికారులతో పూర్తిగా వివరాలు తెలుసుకుని పాటించడం వల్ల ఉపయోగం ఉంటుంది.

న్యూస్ బాక్స్

ఘనంగా సహకార సంఘం వారోత్సవాలు

భూత్పూర్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): 71వ అఖిలభారత సహకార సంఘాల వారోత్సవాలను గురువారం స్థానిక సహకార సంఘం కార్యాలయంలో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా సంఘం ౘైర్మన్ కదిరె అశోక్‌రెడ్డి వారోత్సవ జెండాను ఎగురవేసి, మాట్లాడారు. సహకార సంఘాలు ఏర్పడి 71ఏళ్లు అవుతుందని, రైతుల శ్రేయస్సు కోసం కృషి చేస్తున్నాయన్నారు. కార్యక్రమంలో సీఈవో రత్నయ్య, సహకార సంఘం డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు.

● గండీడ్: మండల కేంద్రంలోని మండల ప్రాథమిక సహకార సంఘం కార్యాలయం వద్ద పీఏసీఎస్ ౘైర్మన్ లక్ష్మీనారాయణ జెండాను ఆవిష్కరించి సహకార గీతాన్ని ఆలపించారు. కార్యక్రమంలో డైరెక్టర్ సత్యనారాయణరెడ్డి, నర్సమ్మ, డీసీసీబీ సూపర్‌వైజర్ శ్రీహరి, సంఘం సీఈవో ఆశన్న, రైతులు పాల్గొన్నారు.

● మిడ్జిల్: కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను అన్నివిధాలా ఆదుకునేందుకు కృషి చేస్తున్నదని, ప్రభుత్వం అందించే ప్రతి పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని పీఏసీఎస్ వైస్ ౘైర్మన్ తంగెళ్ల అల్వాల్‌రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని పీఏసీఎస్ కార్యాలయం వద్ద సీఈవో బాల్‌రెడ్డితో కలిసి జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మార్కెట్ డైరెక్టర్ బంగారు, కృష్ణయాదవ్, బీరప్ప, రైతులు పాల్గొన్నారు.

ఘనంగా మహాపడి పూజ

భూత్పూర్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తమొల్గరలో గురువారం ఆ గ్రామానికి చెందిన మలిశెట్టి వెంకటేష్ అయ్యప్ప మహాపడిపూజ నిర్వహించాడు. కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కేసీరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ యువజన విభాగం అధ్యక్షుడు భూపతిరెడ్డి, పార్టీ ముఖ్యనాయకులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

గండీడ్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వెన్నాచేడ్ లో పాలేపల్లి హన్మయ్య మృతి చెందడంతో గ్రామ ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో రూ.5వేలు ఆర్థిక సహాయం అందించారు. ఈసందర్భంగా మాజీ సర్పంచ్ పుల్లారెడ్డి, గోపాల్ మాట్లాడుతూ ఎవరైనా ఇబ్బందుల్లో ఉన్నప్పుడు ఆర్థిక సాయం అనేది ధైర్యం నింపుతుందన్నారు.

జవహర్‌లాల్ నెహ్రూ విగ్రహానికి ఘన నివాళి

జడ్చర్ల, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని దివంగత నెహ్రూ జయంతి సందర్భంగా గురువారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పట్టణంలోని సిగ్నల్‌గడ్డలో నెహ్రూ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. దేశానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన ఎస్పీ

మహబూబ్‌నగర్ రూరల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ధర్మాపూర్‌లోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం ఎస్పీ జానకి సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె రైతులతో మాట్లాడారు.

● మండలంలోని కోడూరు ఎక్స్ రోడ్డులోని వివేకవాణి పాఠశాలలో గురువారం బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిచారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఆటలపోటీలు నిర్వహించారు.

సన్నరకాల వడ్లకు రూ.500 బోనస్



మున్ననూరు గ్రామ శివారులోని ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద రైతులతో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి వెంకటేష్

- రాబోయే రెండు రోజుల్లో వర్షసూచన
- రైతులు అప్రమత్తంగా ఉండాలి
- జిల్లా వ్యవసాయాధికారి వెంకటేష్

మిడ్జిల్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): రాబోయే రెండు రోజుల్లో జిల్లాకు వర్షసూచన ఉందని వరిధాన్యం ఆరబోసుకున్న రైతులు అప్రమత్తంగా ఉండాలని, టార్పాలిన్‌లు అందుబాటులో ఉంచుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి వెంకటేష్ తెలిపారు. గురువారం మండలంలోని మున్ననూర్ టోల్‌ప్లాజా వద్ద ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా వ్యవసాయాధికారి వెంకటేష్ పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం సన్నరకాల వడ్లకు బోనస్‌గా రూ.500 అందజేస్తుందని తెలిపారు. ధాన్యం మిల్లులకు వెళ్లిన 48 గంటలలోపే రైతుల ఖాతాలలో డబ్బులు జమ చేయడం జరుగుతుందన్నారు. ధాన్యం ఆరబోసుకున్న రైతులు వర్ష సూచన ఉన్నందున అప్రమత్తంగా ఉండాలని, టార్పాలిన్, కవర్లు అందుబాటులో ఉంచుకోవాలని చెప్పారు. ఆయన వెంట ఏవో సిద్ధార్థ, ఏఈవోలు అశ్రపాతిమా, నాయకులు, రైతులు మల్లికార్జున్‌రెడ్డి, వెంకటయ్య, రవి, చెన్నయ్య, వరిధాన్యం కొనుగోలు ఇంచార్జీ శేఖర్‌తో పాటు పలు గ్రామాలకు చెందిన రైతులు తదితరులున్నారు.

కలెక్టర్‌పై దాడిచేసిన వారిని అరెస్టు చేయాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న టీఎన్‌జీవోస్, టీజీవోస్ నాయకులు

పాలమూరు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్, కాడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డిపై దాడిచేసిన వారిని తక్షణమే అరెస్టు చేయాలని టీజీఈజేఏసీ ౘైర్మన్, టీఎన్‌జీవోస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు జి.రాజీవ్‌రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం కేంద్ర సంఘం పిలుపుమేరకు జిల్లా కేంద్రంలోని ఐడీవోసీ ప్రాంగణంలో మధ్యాహ్నం భోజన విరామ సమయంలో ధర్నా నిర్వహించారు. దాడిచేసిన వారిపై పీడీయాక్టు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. తమకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వం తీసుకోవాలన్నారు. ఆర్.చంద్రానాయక్, టీజీవో రాజ్‌గోపాల్, ట్రెస్సా అధ్యక్షుడు చెన్నకిష్టన్న, మదన్‌మోహన్, టీఎన్‌జీవోస్ కోశాధికారి డా.కృష్ణమోహన్ ప్రసంగించారు. కార్యక్రమంలో ఉద్యోగులు పాల్గొన్నారు.

రైస్‌మిల్లులను తనిఖీ చేసిన అధికారులు



తాటికొండ శివారులోని రైస్‌మిల్లులో పరిశీలిస్తున్న అధికారులు, నాయకులు

భూత్పూర్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): రైతులకు ఇబ్బందులు రానీయకుండా వరిధాన్యాన్ని కొనుగోలు చేయాలని మిల్లర్లకు మండల ప్రత్యేక అధికారి వేణుగోపాల్ సూచించారు. గురువారం మండలంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న రైస్‌మిల్లులను తహసీల్దార్ అబ్దుల్ రహమాన్, ఏవో మురళీధర్, ఎస్‌ఐ చంద్రశేఖర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు మండలంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న రైస్ మిల్లులను తనిఖీ చేశారు. రైస్‌మిల్లర్లతో మండల ప్రత్యేక అధికారి వేణుగోపాల్ మాట్లాడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కేసీరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, యువజన విభాగం అధ్యక్షుడు భూపతిరెడ్డి, మాజీ సర్పంచ్ హర్యానాయక్, ఎస్‌ఐ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై ధాన్యం ఆరబెట్టవద్దు



భూత్పూర్ వద్ద జాతీయ రహదారిపై ఆరబెట్టిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న ఎస్‌ఐ చంద్రశేఖర్

భూత్పూర్, నవంబరు14 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిపై వరి, ఇతర ధాన్యాలు ఆరబెట్టడం, కుప్పలుగా పోయడం వంటివి చేయరాదని భూత్పూర్ ఎస్‌ఐ చంద్రశేఖర్ రైతులకు సూచించారు. గురువారం ఆయన స్థానిక పోలీస్ సిబ్బందితో కలిసి 44వ జాతీయ రహదారిపై వరి ధాన్యాన్ని కుప్పలుగా పోసిన, ఆరబెట్టిన ప్రదేశాలను పరిశీలించారు. మండలంలోని పోతులమడుగు గ్రామ స్టేజీ వద్ద గ్రామానికి మళ్లేదారి పైన ఆరబెట్టిన వరి ధాన్యాన్ని పరిశీలించారు. ధాన్యం ఆరబోస్తే జరిగే ప్రమాదాల గురించి వివరించారు. రైతులు కల్లాల్లో, గ్రామాల పరిసరాల్లోని ఖాళీ ప్రదేశాల్లో ధాన్యం ఆరబెట్టుకోవాలని సూచించారు.

విద్యార్థులకు టై, బెల్టులు, ఐడీ కార్డుల అందజేత



రాణిపేటలో విద్యార్థులకు పెన్నులు, పెన్సిల్లు అందజేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

మిడ్జిల్, నవంబరు 14:(ఆంధ్రజ్యోతి), మండలంలోని మున్ననూరు గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో గురువారం ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి అందజేసిన ఐడీకార్డులు, టై,బెల్టులు, షూలను గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు జంగయ్య, మల్లికార్జున్‌రెడ్డి, నిరంజన్‌తో పాటు పలువురు నాయకులు విద్యార్థులకు అందజేశారు. రాణిపేట గ్రామంలోని ఎంఈవో సుధాకర్‌తో కలిసి కాంగ్రెస్ పార్టీ నాయకులు కర్నెకోట మల్లేష్‌జీతో కలిసి పలువురు నాయకులు అమీర్, పంచాయతీ కార్యదర్శి సుదర్శన్, పాఠశాల ఉపాధ్యాయులు మోహన్, ప్రభావతిలు విద్యార్థులకు పెన్నులు, పెన్సిల్లు, నోటుపుస్తకాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆయాగ్రామాలకు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులతో పాటు ఇతర పార్టీల నాయకులు పాల్గొన్నారు.

బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనలో భాగస్వాములవ్వాలి



అంధుల పాఠశాలలో మాట్లాడుతున్న చీఫ్‌లీగల్ ఎయిడ్ కౌన్సిల్ పుట్టపాగ రఘుపతి

పాలమూరు, నవంబరు14(ఆంధ్రజ్యోతి): సమాజంలోని ప్రతీఒక్కరు బాలకార్మికవ్యవస్థ నిర్మూలనలో భాగస్వాములవ్వాలని చీఫ్‌లీగల్ ఎయిడ్ కౌన్సిల్ పుట్టపాగ రఘుపతి పిలుపునిచ్చారు. జిల్లా న్యాయమూర్తి పాపిరెడ్డి, లోక్‌అదాలత్ సెక్రెటరీ ఇందిర ఆదేశాలతో పాన్ ఇండియా ప్రోగ్రాంలను నిర్వహించారు. గురువారం జిల్లా కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో చేపట్టిన న్యాయ అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. 14ఏళ్లలోపు పిల్లలను ఎవరు పనిలో పెట్టుకోవద్దని సూచించారు. ఎవరైన పనిలో పెట్టుకుంటే పోలీసులు, న్యాయస్థానానికి తెలియజేయాలన్నారు. సాయంత్రం పట్టణంలోని అంధుల పాఠశాలలో పాల్గొని అంధుల హక్కుల చట్టాల గురించి వివరించారు. కార్యక్రమంలో యశ్వర్‌యాదవ్, సి.మల్లారెడ్డిలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని, బాలికలు జాగ్రత్తగా ఉండాలన్నారు.

చిన్నారులకు స్టడీ మెటీరియల్ వితరణ

హన్వాడ, నవంబరు14(ఆంధ్రజ్యోతి): నిరుపేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు సంస్థ పని చేస్తుందని బుద్ధ లైట్ ఇంటర్నేషనల్ అసోసియేషన్ ఏషియా చాప్టర్ ఇంచార్జి వినరబుల్ చూమన్ అన్నారు. బాలల దినోత్సవం సందర్భంగా గురువారం మండలంలోని గొండ్యాల, బుద్దారం, పీర్లప్పగడ్డతండా, కొనగట్టుపల్లి, తిరుమలగిరి ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు సంస్థ స్వెటర్లు, చాపలు, స్టడీ మెటీరియల్స్ అందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సంస్థ జాతీయ సభ్యులు ఏషియా చాప్టర్ ఇన్‌చార్జి వినరబుల్ చూమన్ హాజరై విద్యార్థులకు వస్తువులను అందించి మాట్లాడారు. కార్యక్రమంలో సంస్థ హైదరాబాద్ అధ్యక్షుడు మాతాజీ ఉపెక్క, కార్యదర్శి మంత్రి బాలయ్య, జిల్లా ఇన్‌చార్జి డాక్టర్ నాగయ్య, ప్రవీణ్‌కుమార్, బాలకిష్టయ్య, అరుణకుమారి, శ్రీను, సుజాత, అశోక్, ప్రతిభారాణి పాల్గొన్నారు.

సర్వే పకడ్బందీగా నిర్వహించాలి

దేవరకద్ర, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): సర్వేను పకడ్బందీగా చేయాలని ఎన్యుమరేటర్లకు ఎంపీడీవో శ్రీనివాస్‌రావు సూచించారు. గురువారం గోపన్‌పల్లిలో చేపట్టిన సర్వేను ఆయన తనిఖీ చేశారు. ఎన్యుమరేటర్లు ఇంటింటికీ తిరిగి ఫార్మాట్ ప్రకారం వివరాలు సక్రమంగా నమోదు చేయాలని సిబ్బందికి సూచించారు. ఫార్మాట్‌లో ఉన్న ప్రతీ అంశాన్ని నింపాలన్నారు.

జోరుగా ధాన్యం కొనుగోళ్లు

దేవరకద్ర, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): దేవరకద్రకు వ్యవసాయ మార్కెట్ యార్డులో వరి ధాన్యం కొనుగోలు జోరుగా కొనసాగుతున్నది. గురువారం ధాన్యంతో మార్కెట్ కళకళలాడుతున్నది. వేలం ధరలు ఆర్‌ఎన్‌ఆర్ గరిష్ఠంగా 2409, కనిష్ఠంగా 1901 పలికింది, ఆర్‌ఎన్‌ఆర్ 2091 క్వింటాళ్లు విక్రయానికి వచ్చాయని మార్కెట్ అధికారి జయశ్రీ తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

నవాబ్‌పేట, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలుగ్రామాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ సంతోష్‌కుమార్ తెలిపారు. కొల్లూర్ సబ్‌స్టేషన్ పరిధిలో చౌడూర్ ఫీడర్ ఉదయం 9నుంచి మధ్యాహ్నం ఒంటిగంటల వరకు, నవాబ్‌పేట సబ్‌స్టేషన్ పరిధిలో ఏజీఎల్ ఫీడర్‌లో మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు, తీగలపల్లి సబ్‌స్టేషన్ పరిధిలోని కాకర్లపాడ్ ఫీడర్‌లో, నవాబ్‌పేట సబ్‌స్టేషన్ టౌన్ ఫీడర్‌లో, గురుకుంట ఫీడర్, ఇప్పటూర్ ఫీడర్‌లో, చెన్నారెడ్డిపల్లి ఫీడర్‌లోవిద్యుత్ సరఫరా నిలిపివేస్తామని మండల ప్రజలు వినియోగ దారులు సహకరించాలని ఆయన కోరారు.

ఘనంగా జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు

మహబూబ్‌నగర్ విద్యావిభాగం 14 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయ వారోత్సవాల్లో విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొనాలని గ్రంథాలయ ౘైర్మన్ మల్లు నరసింహారెడ్డి అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలో గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకొని సరస్వతి చిత్రపటానికి పూలమాలలు వేసి జ్యోతి ప్రజ్వలన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ముడా ౘైర్మన్ లక్ష్మణ్‌యాదవ్, మార్కెట్ కమిటీ ౘైర్మన్ బెక్కరి అనిత, కార్యదర్శి మనోజ్ కుమార్, గ్రంథాలయ సిబ్బంది ఉన్నారు.

కాకర్లపాడులో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న నాయకులు

నవాబ్‌పేట, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): కాకర్లపాడు గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం ప్రారంభించినట్లు ఏఈవో గౌతమి, ఫైనేద్దిన్ తెలిపారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సింగిల్‌విండో మాజీ డైరెక్టర్ నర్సింహులు, కట్ట వీరాంజనేయులు, నర్సింహులు పాల్గొన్నారు.

చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి

గండీడ్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): డ్రగ్స్, మద్యం, ధూమపానం వంటి చెడుఅలవాట్లకు విద్యార్థులు దూరంగా ఉండాలని ఎంఈవో జనార్దన్, డా. వెంకటేష్ చెప్పారు. గురువారం స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు చెడుఅలవాట్లు, వ్యసనాలపై అవగాహన కల్పించారు. గ్రామాల్లో గంజాయి లాంటివి వాడితే 1908 నంబర్‌కు ఫోన్ చేసి తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

తమిళనాడు ఐసీటీ విభాగంతో పీయూ ఎంఓయూ ఒప్పందం

పాలమూరు యూనివర్సిటీ, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు రాష్ట్రంలోని ఐసీటీ అకాడమితో పాలమూరు యూనివర్సిటీ ఎంఓయూ కుదుర్చుకుంది. గురువారం హైదరాబాద్‌లోని ఐసీటీ అకాడమిలో తమిళనాడు ఐటీ మినిస్టర్ పలనివేల్ త్యాగరాజన్‌తో ఐసీటీ అధికారులతో పత్రాలను మార్చుకున్నారు.

జాతీయ స్థాయి పోటీలకు వాగ్దేవి విద్యార్థి

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఈనెల 19నుంచి 25వ తేదీ వరకు పంజాబ్‌లోని పాటియాలాలో జాతీయ స్థాయి బాస్కెట్ బాల్ టోర్నమెంట్‌లో పాల్గొనే తెలంగాణ రాష్ట్ర జట్టులో జిల్లా కేంద్రంలోని వాగ్దేవి కళాశాలకు చెందిన అదిత్ నారాయణ్ ఎంపిక కావడం చాలా సంతోషకరమని వాగ్దేవి కళాశాల కరస్పాడెంట్ విజేత ఎంకటరెడ్డి విద్యార్థినిని ఘనంగా సనామనించి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచి కళాశాలకు మంచిపేరు తేవాలన్నారు. కార్యక్రమంలో ఐఐటీ నీట్ అకాడమి ఇన్‌చార్జీ పావని రెడ్డి, వైస్ ప్రిన్సిపల్ జ్యోతినందన్‌రెడ్డి, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప స్వాములకు మాజీ మంత్రి ఆర్థిక సాయం

జడ్చర్ల, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): అయ్యప్ప స్వాములు అక్టోబరు 15న జడ్చర్ల నుంచి దాదాపు 36 మంది అయ్యప్పస్వామి మాలధారణతో శబరిమలకు పాదయాత్ర చేస్తున్న స్వాములకు మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు లక్ష్మారెడ్డి రూ.50వేలు అందజేశారని అయ్యప్పస్వాములు తెలిపారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

జడ్చర్ల మండలంలోని పోలేపల్లిలో సింగిల్‌విండో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం సింగిల్‌విండో వైస్ ౘైర్మన్ సుధాకర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా బాలల దినోత్సవం

- పాఠశాలల్లో దివంగత మాజీ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ జయంతి వేడుకలు



దేవుళ్ల వేషధారణలో న్యూరిషి విద్యార్థులు

భూత్పూర్/దేవరకద్ర/కోయిలకొండ/రాజాపూర్ /మహబూబ్‌నగర్ విద్యావిభాగం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని దివంగత చాచానెహ్రూ జయంతి సందర్భంగా గురువారం జిల్లా వ్యాప్తంగా ప్రైవేటు, ప్రభుత్వ పాఠశాలల్లో బాలల దినోత్సవం నిర్వ హించారు. నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా విద్యా ర్థులకు వివిధ పోటీలు నిర్వహించి, బహుమతులు అందజేశారు. పలువురు విద్యార్థులు నెహ్రూ వేషధారణతో ఆకట్టుకున్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. రాజాపూర్ మండలంలోని దొండ్లపల్లి ఎంపీటీసీ సభ్యుడు చించోడ్ అభిమన్యురెడ్డి చిన్నారులు, వారి తల్లిదండ్రుల కోరిక మేరకు మండల కేంద్రంలోని ఓ అంగన్‌వాడీ కేంద్రం రోడ్డుకు దగ్గరగా ఉండడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని స్థానికులు పిల్లలను బడి పంపడం లేదు. వారి కోరిక మేరకు గురువారం బాలల దినోత్సవం సందర్భంగా గేటును ఏర్పాటు చేయించారు. ఈ సందర్భంగా ఆయనకు స్థానికులు, చిన్నారుల తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

చిన్నారులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

దేశ భవిష్యత్తు చిన్నారుల చేతుల్లోనే ఉందని, విద్యలో రాణించి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని రాజేంద్రనగర్‌లోని న్యూరిషి పాఠశాల ౘైర్మన్ చంద్రకళ వెంకటయ్య అన్నారు. శుక్రవారం బాలల దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముందుగా చాచా నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి, జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాలను ప్రారంభించారు. చిన్నారులే వ్యాఖ్యాతలుగా వ్యవహరించి, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

ఆధ్యాత్మిక, పౌరాణిక కార్యక్రమాలతో పాటు దేశంలోని అన్ని ప్రాంతాల నృత్యాలను చేసి ఆకట్టుకున్నారు. ఇటివల కాలంలో వచ్చిన సినిమాలైన దేవర, కాంతార సినిమా పాటలకు నృత్యాలు చేశారు. కార్యక్రమంలో డ్యాన్స్ మాస్టర్ రాజశేఖర్, డైరెక్టర్స్ పూజిత మోహన్ రెడ్డి, శిరిషప్రవీణ్, సాయి సుశాంత్, కృష్ణ, ప్రిన్సిపాల్ వెంకట రమణ అధ్యాపక బృందం తదితరులు పాల్గొన్నారు.

దేశానికి నెహ్రూ చేసిన సేవలు మరువలేనివి



నెహ్రూ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

మహబూబ్‌నగర్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మాజీప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ దేశానికి ఎన్నో సేవలందించారని కాంగ్రెస్ నాయకులు గుర్తుచేసుకున్నారు. సుదీర్ఘకాలంగా దేశానికి ప్రధానమంత్రిగా పనిచేసిన ఆయన దేశాన్ని అన్ని రంగాలలో ముందుకు తీసుకెళ్లారన్నారు. గురువారం ఆయన జయంతిని పురస్కరించుకుని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో డీసీసీ ఉపాధ్యక్షుడు సత్తూరు చంద్రకుమార్ గౌడ్ ఆధ్వర్యంలో నెహ్రూ జయంతి వేడుకలు నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ ౘైర్మన్ మల్లు నర్సింహారెడ్డి, ముడా ౘైర్మన్ లక్ష్మణ్‌యాదవ్, నాయకులు జహీర్‌అక్తర్, సీజె బెనహర్, అనిత, అజ్మత్‌అలీ, అవేజ్, ఫక్రుద్దీన్, బాలస్వామి, ఫహీం, తాహెర్ పాల్గొన్నారు.

కుమారస్వామి మరణం బాధాకరం

- మాజీ ఎంపీ మన్నె, మాజీ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి



కుమారస్వామి మృతదేహానికి నివాళి అర్పిస్తున్న మాజీఎంపీ మన్నె, మాజీ ఎమ్మెల్యే సీఎల్‌ఆర్

నవాబ్‌పేట, నవంబరు14 (ఆంధ్రజ్యోతి): కూచూర్ మాజీ ఎంపీటీసీ విజయశ్రీ భోజయ్యచారి బావ కుమారస్వామి ఆకస్మిక మరణం బాధాకరమని మాజీ ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి విచారం వ్యక్తం చేశారు. గురువారం కుమారస్వామి గుండెపోటుతో మరణించారని తెలియడంతో వారు గురువారం రాత్రి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కుటుంబానికి అండగా ఉంటామన్నారు. కార్యక్ర మంలో స్థానిక నాయకులు పిట్టల రవి ఉన్నారు.

ప్రజాపాలనను ప్రజలు గమనిస్తున్నారు

సాధ్యం కాని హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజాపరిపాలనను తెలంగాణ ప్రజలు గమనిస్తున్నారని మాజీ ఎంపీ మన్నె శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి అన్నారు. గురువారం నవాబ్‌పేట మాజీ సర్పంచ్ గోపాల్ గౌడ్, హజిలాపూర్ బీఆర్‌ఎస్ కార్యకర్త వినోద్‌రావు ఇంట్లో విందుకు హాజరైన వారు కార్యకర్తలతో మాట్లాడారు. ఎవరూ ఆందోళన చెందవద్దని చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ శ్రీనివాస్, గోపాల్ గౌడ్, రుద్రారం కృష్ణ గౌడ్, సిద్దోటం నర్సింహులు పాల్గొన్నారు.

ధాన్యం సేకరణలో ఇబ్బంది పెట్టొద్దు

కోయిలకొండ, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ధాన్యం సేకరణలో రైతులను ఇబ్బందులు పెట్టవద్దని తహసీల్దార్ రాజా గణేష్ సూచించా రు. గురువారం మండలంలోని మల్కాపూర్ ,కోయిలకొండ ఆచార్యపూర్ తదితర గ్రామాల్లో వరి కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. మండలంలోని సింగిల్‌విండో, ఐకేపీ ద్వారా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని అందులో వరి ధాన్యం విక్రయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై భాస్కర్‌రెడ్డి, హెడ్‌కానిస్టేబుల్ నర్సిములు తోపాటు రైతులు పాల్గొన్నారు.

ఎంపీ డీకే అరుణను అడ్డుకోవడం సరికాదు



మహబూబ్‌నగర్‌లోని పార్టీ కార్యాలయంలో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి

మహబూబ్‌నగర్ క్లాక్‌టవర్/ మిడ్జిల్, నవంబరు14 (ఆంధ్రజ్యోతి): కొడంగల్ నియోజకవర్గం లగచర్లలో జరిగిన ఘటనను తెలుసుకొనేందుకు మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌ను కలిసేందుకు వెళ్తుండగా ఆమెను మన్నెగూడలో పోలీసులు అడ్డుకోవడం తగదని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పి.పాండురంగారెడ్డి అన్నారు. గురువారం జిల్లా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కలెక్టర్‌ను కలిసేందుకు ముందుగానే అనుమతి తీసుకొని, ఎంపీ హైదరాబాద్ నుంచి బయలుదేరారని, మార్గమధ్యలో పోలీసులు ఆపడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. కనీసం వార్డు మెంబర్ కూడా కాని ముఖ్యమంత్రి అన్న తిరుపతిరెడ్డికి వర్తించని 144 సెక్షన్, డీకే అరుణమ్మకు ఎలా వర్తిస్తుందన్నారు. తక్షణమే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పద్మజారెడ్డి, ప్రధానకార్యదర్శి కొత్తకోట కిరణ్ కుమార్ రెడ్డి, ఉపాధ్యక్షుడు కిష్టు నాయక్, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు పిట్టల ఆదయ్య, నాయకులు పాల్గొన్నారు.

అడ్డుకోవడం అప్రజాస్వామికం

రైతులను కలిసేందుకు వెళ్తున్న ఎంపీని పోలీసులు అడ్డుకోవడం అప్రజాస్వామికం అని మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు సాహతీరెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వెంటనే అరుణమ్మకు పోలీసులు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

రాష్ట్ర ప్రజలను మోసం చేస్తున్న కాంగ్రెస్

ఎంపీ అరుణను అడ్డుకున్న పోలీసులు, సీఎం రేవంత్ సోదరులు 300మందితో కలిసి వెళితే ఎందుకు అడ్డుకోలేదని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్, కోశాధికారి పాండురంగారెడ్డి ప్రశ్నించారు. గురువారం మిడ్జిల్‌లోని బీజేపీ కార్యాలయంలో యువమోర్చా జిల్లా అధ్యక్షుడు తిరుపతితో కలిసి వారు విలేకరులతో మాట్లడారు. రాష్ట్రంలో పోలీసులు ఏకపక్ష ధోరణిని అవలంభిస్తున్నారని అన్నారు. ప్రభుత్వాలు, ప్రజాప్రతినిధులు ఏళ్లకాలం ఉండరని చట్టాన్ని ప్రతి ఒక్కరూ గౌరవించాలన్నారు. కార్యక్రమంలో బుడ్డన్న, నరేష్‌నాయక్, నరేందర్, శేఖర్, విష్ణు, నరేష్ పాల్గొన్నారు.